ఖాజీపేటకు జీపీఆర్ ప్రత్యేక రైలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: రైల్వే భద్రత, వేగం పెంపు కోసం ట్రాక్ సామర్థ్యాన్ని గుర్తించే గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) యంత్రం ఉన్న ప్రత్యేక రైలు బిట్రగుంట నుంచి ఖాజీపేటకు తరలి వెళ్లింది. ఈ నెల 13న ఈ రైలుతో బిట్రగుంట- తలమంచి, బిట్రగుంట- ఉలవపాడు రైల్వేస్టేషన్ల మధ్య పరీక్షలు నిర్వహించారు. మరుసటి రోజు నుంచి వర్షాలు కురవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. దీనికి తోడు ఓ పరికరం పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిసింది. దీన్ని ఢిల్లీ నుంచి తెప్పించి ఖాజీపేటలోని వర్క్‌షాపులో అమర్చాక మళ్లీ బిట్రగుంటకు వస్తుందన్న సమాచారం. ఈనేపథ్యంలో రష్యా సాంకేతిక నిపుణుల బృందం కూడా వెళ్లారు.



కందుకూరు డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు డీఎస్పీగా నియమితులైన సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం గురువారం స్థానిక సబ్‌డివిజనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎ.శ్రీనివాసరావు గుంతకల్లు డీఎస్పీగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఉన్న బాలసుబ్రహ్మణ్యం కందుకూరుకు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. కందుకూరు, గుడ్లూరు సీఐలు, ఎస్సైలు ఆయనకు స్వాగతం పలికారు.

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం అక్టోబరు 18, 2024

ఇదండీ.. వరస



కోవూరు చక్కెర కర్మాగారం వద్ద నిల్వ చేసిన ఇసుక నింపుకోడానికి గురువారం రహదారి వెంబడి బారులుదీరిన టిప్పర్లు ఇవి. సంగం వద్ద పెన్నానదిలో డ్రెడ్జింగ్ విధానంలో తీసిన ఇసుకను ఇక్కడ నిల్వచేసి విక్రయిస్తున్నారు. గిరాకీకి ఈ చిత్రం నిదర్శనంగా నిలిచింది.

- ఈనాడు, నెల్లూరు

దామరమడుగు



బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు వద్ద జగనన్న ఇళ్ల పథకం కింద లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకుంటున్న ఇళ్లు ఇవి. 50 ఇళ్లలో చాలావరకు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఇక్కడ మౌలిక వసతులు దేవుడెరుగు.. వర్షం వస్తే నిర్మాణంలో ఉన్న ఇళ్ల మధ్య నీరు చేరుతుంది. పూర్తయిన ఇళ్లలోనూ ఉండలేక ఖాళీచేసి ఊర్లో ఉంటున్నారు. - ఈనాడు, నెల్లూరు

ఓపెన్ రీచ్‌లకు.. అనుమతి ఖరారు

లాటరీ విధానంలో గుత్తేదారులకు కేటాయింపు ● 21వ తేదీ నుంచి తవ్వకాలు, 10 స్టాక్‌పాయింట్ల ఏర్పాటు

ఈనాడు, నెల్లూరు: నదుల్లో తవ్వకాలు ప్రారంభించి.. ఉచిత ఇసుకను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆ క్రమంలో జిల్లాలోని నాలుగు ఓపెన్ రీచ్‌ల ప్రారంభానికి కసరత్తు మొదలైంది. వాటిని గుత్తేదారులకు అప్పగించేందుకు ఈ నెల ఏడో తేదీ నుంచి టెండర్లు ఆహ్వానించిన అధికారులు- బుధవారం సాయంత్రంతో గడువు ముగియగా.. గురువారం జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో తెరిచారు. ఇసుక తవ్వకం(మాన్యువల్) టన్నుకు రూ.90, అక్కడి నుంచి స్టాక్‌పాయింట్/డిపోకు రవాణా(ట్రాక్టర్‌తో) చేసేందుకు కి.మీకు రూ. 4.90(జీఎస్‌టీతో కలిపి)గా నిర్ణయించారు. అలాగే, స్టాక్ పాయింట్ నుంచి లోడింగ్ చేసేందుకు రూ. 20 చొప్పున నిర్ణయించారు. ఇందుకు మొత్తం 23 మంది ఔత్సాహికులు పోటీపడగా- 43 దరఖాస్తులు దాఖలు చేశారు. వీటిలో ఒకటి జీఎస్టీ సక్రమంగా లేకపోవడంతో రద్దయింది.

సీనరేజీ ఫీజు.. నిర్వహణ ఖర్చులే వసూలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో ఇసుక తవ్వకాలపై కేసులు ఉన్నాయి. గత ప్రభుత్వం నదుల్లో ఇష్టానుసారం యంత్రాలతో ఇసుక తవ్వేయడంపై సుప్రీంకోర్టు విచారణకు ఆదేశించింది. నిబంధనల ప్రకారం రుతుపవనాల కాలం(జూన్ 1- అక్టోబరు 15)లో నదుల్లో ఇసుక తవ్వకూడదు. వీటన్నిటినీ పాటించిన ప్రభుత్వం.. ప్రజలకు ఇబ్బంది లేకుండా.. జిల్లాలోని మూడు ప్రాంతాల్లో డీసిల్టేషన్ ద్వారా ఇసుకను అందుబాటులోకి తెచ్చింది. నిత్యం ఆరువేల మెట్రిక్ టన్నులు తీసి.. మూడు నిల్వ కేంద్రాల ద్వారా అందించింది. ప్రస్తుతం పెన్నానదిలోని పడమటి కంభంపాడు, మినగల్లు, విరువూరు, పల్లిపాడు ప్రాంతాల్లో తవ్వకాలకు టెండర్లు నిర్వహించింది. వీటన్నింటిలో 2.86 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి వస్తుందని అంచనా. ఇక్కడి నుంచి తరలించిన ఇసుకను.. జిల్లాలో ఏర్పాటు చేసిన పది స్టాక్ పాయింట్లకు తరలించి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.



కలెక్టరేట్‌లో ఇసుక టెండర్ల ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

ఇవీ వివరాలు

ఓపెన్ రీచ్	మండలం	ఇసుక తవ్వకాల పరిమాణం(మె.టన్నులు)
మినగల్లు-4	బుచ్చిరెడ్డిపాళెం	70,350
పడమటి కంభంపాడు-2	అనంతసాగరం	73,200
పల్లిపాడు-4	ఇందుకూరుపేట	73,200
విరువూరు-3	పొదలకూరు	69,750

తగ్గనున్న ధర!

ఈ నెల 21వ తేదీ నుంచి నదిలో మాన్యువల్ పద్ధతిలో ఇసుక తవ్వకాలు ప్రారంభించనున్నట్లు సమాచారం. రీచ్‌ల వద్దకు వెళ్లి.. అక్కడ ఆన్‌లైన్‌లో చెల్లించి తీసుకువెళ్లేందుకు వీలు కల్పించనున్నారు. సీనరేజ్ ఫీజు, ఇసుక తవ్వినందుకైన ఖర్చు వంటివి చెల్లించి.. తీసుకెళ్లొచ్చు. దీంతో నిల్వ కేంద్రాల కంటే తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

అంతకంటే తక్కువకు..

గతంలో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) ద్వారా నదుల్లో తవ్వకాలు జరిపించినప్పుడు మెట్రిక్ టన్నుకు రూ.90-100 చొప్పున చెల్లించారు. ఇప్పుడు అదే ధరలతో టెండర్లు పిలిచారు. ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం.. కూలీలతో తవ్వి, లోడ్ చేయించేందుకు టన్నుకు రూ. 120-150 వరకు ఇస్తేనే గిట్టుబాటవుతుందని చెబుతుండగా.. టెండర్లు వేసిన గుత్తేదారులు, అంతకంటే తక్కువ ధరకు కోట్ చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ గుత్తేదారు ఇరువూరు రీచ్ నుంచి ఇసుక తవ్వి.. లోడింగ్ మొదలు స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు రూ. 36 మాత్రమే కోట్ చేయడం అధికారులనే ఆశ్చర్యానికి గురి చేసింది. మరోవైపు రాజకీయ ప్రమేయం పెరగడంతో.. మంత్రి నారాయణ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అనంతరం అధికారులు లాటరీ విధానంలో రీచ్‌లను కేటాయించారు. దీనిపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు సమాచారం.




వివరాలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

జెట్టీకి స్థల పరిశీలన


గుడ్లూరు, న్యూస్‌టుడే: రామాయపట్నం సమీపంలో జెట్టీ నిర్మాణానికి కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ గురువారం స్థల పరిశీలన చేశారు. ఓడరేవు నిర్మాణంతో గ్రామాలు కోల్పోయిన ఆవులవారిపాలెం, మొండివానిపాలెం, కర్లపాలెంలోని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లడానికి, పడవలు నిలపడానికి వీలుగా జెట్టీ నిర్మిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది.. ఆ తర్వాత పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాళ్లపాడు పంచాయతీలోని సాలిపేట సమీపంలో జెట్టీ ఏర్పాటుకు సుమారు రెండు ఎకరాల స్థలం కేటాయించింది. ఇక్కడ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

జలకళ.. జనహేల!



సోమశిల జలాశయంలో నీటి నిల్వ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సోమశిలకు వరద ఉద్ధృతి పెరిగింది. తుపాను ప్రభావంతో కడప, కర్నూలు జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలతో.. జలాశయానికి పైనుంచి ప్రవాహం పెరిగింది. దాంతో గురువారం ఉదయం 53.855 టీఎంసీలు ఉన్న నిల్వ.. సాయంత్రానికి 54.894 టీఎంసీలకు పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రానికి నిల్వ టీఎంసీపైన పెరగడం గమనార్హం.



మైలవరం నుంచి...

కడప జిల్లా మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోకి 5వేల క్యూసెక్కులు వస్తుండగా- కుందు నది ప్రవాహం కలుస్తోంది. దాంతో సాయంత్రం 6 గంటలకు ఆదినిమ్మాయపల్లి వద్ద పెన్నాలో 38,000 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. మరోవైపు కండలేరుకు నీటి విడుదలను 6000 క్యూసెక్కుల నుంచి 8000 క్యూసెక్కులకు పెంచారు.

ఉద్ధృతి పెరిగింది

జలాశయంలోకి వరద ప్రవాహం పెరుగుతోంది. సాయంత్రం 35,956 క్యూసెక్కులు నమోదైంది. కండలేరు వరద కాలువకు నీటి విడుదల 8000 క్యూసెక్కులకు పెంచాం.

– బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి, ప్రాజెక్టు ఈఈ

● నెల్లూరు బీవీనగర్‌లోని కేఎన్‌ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు సుమారు 1800 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉన్న గదులు చాలకపోవడంతో నాడు-నేడు కింద రెండో విడతలో 12 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరయ్యాయి. విడుదలైంది మాత్రం రూ. 27 లక్షలే.. ఇక్కడికి మంజూరైనవి వైఎస్‌ఆర్ జిల్లాకు మళ్లించారు. దాంతో పనులు ఆగిపోయాయి. పైగా నాసిరకం కట్టడం వల్ల కిటికీ పైగోడ కూలి విద్యార్థి మృతి చెందారు.



కేఎన్‌ఆర్ పాఠశాలలో బాలుడి మృతికి కారణమైన అసంపూర్తి భవనం ఇదే

● నెల్లూరు మూలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 580 మంది వరకు విద్యార్థినులు చదువుతుండగా.. గదులు చాలక చెట్ల కింద చదువులు సాగించాల్సిన దుస్థితి. ఇక్కడ 2017లో తెదేపా ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణానికి పునాదులు వేయగా.. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం.. వాటిని వదిలేసింది.

నాటి గొప్పలు.. నేడు తిప్పలు!

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామంటూ గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంది. మొదటి, రెండు దశల పేరిట రూ. వందల కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు గుప్పించింది. ఆపై అమలు తీరును అటకెక్కించింది. ప్రభుత్వ తీరుతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా మిగిలాయి. నాటి ప్రభుత్వ గొప్పలు.. నేడు విద్యార్థులకు శాపంగా పరిణమించాయి.


1065 మొదటి విడతలో ఎంపిక చేసినవి
352 వెచ్చించిన నిధులు (రూ. కోట్లలో)
1356 రెండో విడతలో..
466.94 చేసిన ఖర్చు (రూ. కోట్లలో)
రూ. 182 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది



మూలాపేటలో పునాదుల దశలోనే..

అంతటా.. అదే స్థితి..

మొదటి విడతగా 1065 పాఠశాలల్లో నాడు- నేడు కింద తొమ్మిది రకాల(భవనాలు, తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతులు, ఫ్లోరింగ్ ఏర్పాటు, తాగు, వాడుక నీరు) పనులను రూ. 352 కోట్లతో చేపట్టారు. అనంతరం రెండో విడత పేరుతో 1356 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీలు, తాగు, వాడుక నీరు,



జిల్లాలో పాఠశాలలు 3,431
ప్రభుత్వ 2,618 | ప్రైవేటు 814

పాఠశాలల్లో ప్రమాదకరంగా అసంపూర్తి పనులు

మరుగుదొడ్లు, విద్యుత్తు తదితర పనులకు రూ. 466.94 కోట్లు మంజూరు చేశారు. పనులు చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారులు నిధుల కొరతతో వాటిని మధ్యలోనే ఆపేశారు. వైకాపా ప్రభుత్వం.. చేపట్టిన ఈ పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. పాఠశాలల ప్రాంగణాల్లో మొండి గోడలు ప్రాణ సంకటంగా మారాయి. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

నిధుల కొరత

జిల్లాలో 50 శాతం పనులు జరిగాయి. నిధుల కొరతతో ఆగాయి. విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే.. త్వరితగతిన పూర్తి చేస్తాం. అసంపూర్తి భవనాల్లోకి విద్యార్థులు వెళ్లకుండా చర్యలు తీసుకున్నాం.

– సీహెచ్ ఉషారాణి సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఏపీసీ

మహాకావ్యం రామాయణం



వాల్మీకి చిత్రపటం వద్ద కలెక్టర్ ఆనంద్, అధికారులు, బీసీ నాయకులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: మహాకావ్యం రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండగగా జరుపుకోవడం సంతోషకరమని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతి వెలిగించి.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో ఎక్కువగా పేద పిల్లలు ఉంటారని.. వాటిని అభివృద్ధి చేయడానికి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, బీసీ సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసులు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్ష నష్టం.. రూ.52.91 కోట్లు!

13 మండలాలపై అల్పపీడన ప్రభావం
656.35 హెక్టార్లలో పంటలకు దెబ్బ



సీతారామపురంలో వాలిన వరి పంటను సరిచేస్తున్న రైతులు, వారితో కలిసి పరిశీలిస్తున్న ఏవో చెన్నారెడ్డి

ఈనాడు, నెల్లూరు

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజులుగా కురిసిన వర్షాలు.. వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఉద్యాన పంటకు నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. గురువారం వరకు లెక్కించిన మేరకు.. 656.35 హెక్టార్లలో 1376 మంది రైతులు నష్టపోయినట్లు అంచనా వేశారు. ఇంకా పంట నష్టం లెక్కింపు ప్రక్రియ జరుగుతోంది. కోత, గింజ దశలో ఉన్న వరి, వరి నారుమళ్లు, పొగాకు నారు, వేరుసెనగ, మినుము, మిరప పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు 17.6 హెక్టార్లలోని మిరప పొలాల్లోకి నీరు నిలిచినట్లు గుర్తించారు. గురువారం తెల్లవారుజామున అల్పపీడనం నెల్లూరు- పుదుచ్చేరి మధ్యలో తీరం దాటినప్పటికీ.. జిల్లాపై పెద్దగా ప్రభావం చూపలేదు. 6.3 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. పొదలకూరులో అత్యధికంగా 25.6 మి.మి. వర్షపాతం కురిసింది. అన్ని విభాగాలు కలుపుకొని మొత్తం.. రూ. 52.91 లక్షల నష్టం కలిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.



దిలావర్‌భాయ్ వీధిలో కూలిన పెంకుటిల్లు పైకప్పు

మరికొన్ని..

● రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉదయగిరిలోని దిలావర్‌భాయ్ వీధిలో ఓ ఇంటి పైకప్పు పడిపోయింది. సుమారు 115 ఇళ్లు 24 గంటలకుపైగా నీటిలో నానినట్లు తేల్చారు.

● ఆరు పశువులు చనిపోగా.. వీటి విలువ రూ. 1.7 లక్షలుగా తేల్చారు.

● జిల్లాలో మొత్తం 19 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1376 మందికి 2,956 ఆహార పొట్లాలు, 5,539 మంచి నీటి ప్యాకెట్లు అందజేశారు. 98 ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

● జిల్లాలో 23 మంది సభ్యులతో కూడిన ఓ ఎన్డీఆర్ఎఫ్ బృందం సేవలందించింది.

● అయిదు చోట్ల చెట్లు పడిపోగా- భారీ వర్షాలు, నీరు ప్రవహించడం తదితరాలతో సుమారు 86 కి.మీ. ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసమయ్యాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ. 3.60 కోట్లు అవసరమని అంచనా వేయగా.. శాశ్వత మరమ్మతులకు రూ. 47.02 కోట్లు అవుతుందని నిర్ణయించారు.

● మూడు కి.మీ. మేర పంచాయతీ రోడ్లకు మరమ్మతులు అవసరమని, వీటికి తాత్కాలిక పనులకు రూ. 3 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ. 10 లక్షలు అవసరమవుతుందని అంచనా వేశారు.

● నెల్లూరు నగరంతో పాటు కావలి, బుచ్చి, కందుకూరు మున్సిపాలిటీల్లో 6.05 కి.మీ. రోడ్లు ధ్వంసమయ్యాయి. 543 వీధి దీపాలు చెడిపోగా.. వీటికి రూ. 101.49 లక్షలు అవుతుందని తేల్చారు.

● 54 మైనర్ ఇరిగేషన్ కాలువలు దెబ్బతినగా. . మరమ్మతులకు రూ. 420 లక్షలు, 32 ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు రూ. 30.6 లక్షలు, విద్యుత్తుశాఖకు సంబంధించి 21 33కేవీ ఫీడర్లు, 11కేవీ ఫీడర్లు, ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్, 11 కేవీ స్తంభాలు 104, 120 ఎల్‌టీ స్తంభాలకు నష్టం కలగగా... రూ. 21.85 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు.

నిమ్మ మార్కెట్‌లోకి వర్షపునీరు

పొదలకూరు, న్యూస్‌టుడే: నిమ్మ మార్కెట్‌లోని దుకాణాల్లోకి నీరు చేరడంతో.. వ్యాపారులు అవస్థలు పడ్డారు. తూర్పు వైపు నున్న అయిదు దుకాణాల్లో మోకాటి లోతు నీరు చేరగా.. గురువారం ఉదయం విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వ్యాపారులే పొక్లయిన్లతో వర్షపు నీటిని బయటకు పంపే ప్రయత్నాలు చేశారు. అంతలో అక్కడికి చేరుకున్న సోమిరెడ్డి. . మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులపై మండిపడ్డారు. నెల్లూరు ఏడీఎంకు ఫోన్ చేసి.. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సైడు కాలువను నిర్మించేందుకు అంచనాలు రూపొందించి.. పనులు పూర్తి చేయించాలని సూచించారు. తాను వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో సుమారు రూ. పది కోట్లతో యార్డు మొత్తం అంతర్గత సిమెంట్ రోడ్లు, వ్యాపారుల కోసం 24 దుకాణాలు నిర్మిస్తే, వైకాపా హయాంలో వ్యాపారంతో సంబంధం లేనివారికి దుకాణాలు కేటాయించారని మండిపడ్డారు. అర్హులైన వారందరికీ దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి, నిమ్మ వ్యాపారులు రామలింగయ్య, కృష్ణబాబు, యలమందయ్య, వెంకటేశ్వర్లునాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు మస్తాన్‌బాబు, మార్కెటింగ్ మాజీ ఉపాధ్యక్షుడుపులిపాటి వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



దుకాణాలను చుట్టుముట్టిన వర్షపునీరు



'గండం' గట్టెక్కింది.. పనిభారం తగ్గింది

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. నెల్లూరులో మూడు రోజులు శ్రమించి వీధులు, కాలనీల్లో వర్షపు నీరు ఆగకుండా, ముంపు సమస్య తలెత్తకుండా పొక్లెయిన్ల సాయం తీసుకున్నారు. ఎక్కడ నీరు ఆగినా దాదాపు 20కి పైగా యంత్రాల సాయంతో పూడికతీసి నీరు సాఫీగా వెళ్లేలాచేశారు. గురువారం వర్షం పడకపోవడంతో కార్పొరేషన్ కార్యాలయంవద్ద ఇలా ఉండిపోయాయి. –ఈనాడు, నెల్లూరు

ఇది కాలువ కాదు.. అండర్ పాస్

గుడ్లూరు మండలం రావూరు వెళ్లేందుకు జాతీయ రహదారి సమీపంలో రైలు పట్టాల కింద నిర్మించిన అండర్ పాస్ ఇది. ఇటీవలి వర్షాలకు పది అడుగుల మేర నీరు నిలిచాయి. గురువారం ఈ నీటిలో లోతు తెలియక ఉలవపాడుకు చెందిన ఓ రైతు ట్రాక్టరుతో రావూరు వెళ్లడానికి ప్రయత్నించగా.. ఇంజిను మునిగింది. మరమ్మతు కోసం రూ.70 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. నీటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గుడ్లూరు



సొనవాన.. కమనీయ దృశ్యాన

వర్షాలకు సీతారామపురం సమీపంలోని భైరవకోనలో సొనవాన జలపాతం కనువిందు చేస్తోంది. వర్షాలకు ఉద్ధృతంగా పారుతుండడంతో సందర్శనకు చుట్టుపక్కల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. దీంతో కోనలో సందడి నెలకొంది. త్రిముఖ దుర్గాంబికా దేవి ఆలయం ముందునుంచి పారుతోంది.

– న్యూస్‌టుడే, సీతారామపురం



వీధి.. నిర్లక్ష్యపు తీరిది

మూడు రోజుల వర్షాలకు నెల్లూరు నగరంలోని మనుమసిద్ధినగర్‌లో వీధులు దయనీయంగా మారాయి. ప్రధాన రహదారిపై సైతం నీరు నిలిచిపోయింది. ఓ వీధిలో నీరు నిలిచి పచ్చగా మారడంతో ఇళ్లలో నుంచి ప్రజలు కాలు బయట పెట్టలేని దుస్థితి ఏర్పడింది. వర్షం కురిసిన ప్రతిసారీ అవస్థలు తప్పడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (పొదలకూరురోడ్డు)





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో మోహన్‌రావు

పెన్నా లోతట్టు గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఆత్మకూరు : పెన్నానది లోతట్టు గ్రామాలపై ప్రత్యేక దృష్టి నిలపాలని జడ్పీ సీఈవో, తుపాను సహాయక చర్యల ప్రత్యేక అధికారి మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ పెన్నా నది వరద ప్రభావిత గ్రామాలకు ఒక్కోదానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు వివరించారు. ఈ బృందం గ్రామాల్లో పర్యటించి ముంపు ప్రాంతాలను గుర్తించి జనావాసాల్లోకి నీరు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతుందని తెలిపారు. సమావేశంలో డీఎల్‌డీవో రమణయ్య, తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు

సంగం : జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపైనే దృష్టి సారించామని జడ్పీ సీఈవో మోహనరావు తెలిపారు. గురువారం సంగంలోని మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాల్సిందిగా మండల, గ్రామస్థాయి అధికారులకు సూచించామన్నారు. ఎంపీడీవో షాలెట్టు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వీసీ విజయభాస్కర రావు

విద్యతోనే పేదరికం దూరం

వెంకటాచలం, న్యూస్‌టుడే: సమాజంలో పేదరికం ప్రధాన సమస్యగా మారిందని, పేదరికాన్ని దూరం చేయాలంటే విద్య ఒక్కటే మార్గమని వీఎస్‌యూ విజయ భాస్కరరావు అన్నారు. వీఎస్‌యూలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'పేదరిక దినోత్సవ కార్యక్రమం' నిర్వహించారు. ఉప కులపతి మాట్లాడుతూ... పేదరికం కారణంగా విద్య, ఆరోగ్యం, ఆర్థిక భద్రత వంటి అనేక విషయాల్లో వెనకబడతామని, పేదరికం నిర్మూలనకు యువత ముందుకు రావాలన్నారు. విద్యతో పాటు, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలు పేదరికాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు.

ఔషధం.. చిత్తానుసారం!

దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ



గత ఏడాది ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలో వెలుగు చూసిన మత్తు కలిగించే మందుల విక్రయాల్లో నెల్లూరు నగరంలోని దుకాణాల పేర్లు ఉండగా.. రెండింటి లైసెన్సులు రద్దు చేశారు.

జిల్లాలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నా.. అధికారులు కేవలం మొక్కుబడి తనిఖీలకే పరిమితమయ్యారన్న విమర్శలు నెలకొన్నాయి.

న్యూస్‌టుడే, నెల్లూరు (వైద్యం)

వాతావరణ కాలుష్యం, జీవనశైలిలో మార్పులు తదితరాలతో సాధారణ జబ్బులతో పాటు మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. శస్త్రచికిత్సలు అధికమయ్యాయి. ఆ క్రమంలో ఔషధాల వినియోగం పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఔషధ దుకాణదారులు ప్రజలను దోపిడీ చేస్తున్నారు. ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీలు నామమాత్రమవడం.. వారికి కలిసొస్తోంది.

అత్యధికం నెల్లూరులోనే.. నెల్లూరు నగర పరిధిలో 70 శాతం హోల్‌సేల్, 50 శాతానికిపైగా రిటైల్ దుకాణాలు ఉండగా- రిటైల్‌లో 45 శాతం వరకు కావలి, ఆత్మకూరు, కందుకూరు తదితర పట్టణాలు, మండల కేంద్రాలు, మిగిలిన అయిదు శాతం ఇతర ప్రాంతాల్లో ఉన్నాయి. రిటైల్, హోల్‌సేల్ దుకాణాలు కలిపి మందుల కొనుగోలు, అమ్మకాలు తదితర లావాదేవీలు రోజుకు రూ. పది కోట్లకుపైగానే జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లాలో..

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు	600
హోల్‌సేల్ ఔషధ దుకాణాలు	600
రిటైల్	1600
రోజుకు వ్యాపారం..	రూ.10 కోట్లపైనే

నిబంధనలు తూచ్...

మెడికల్ షాపు చిన్నదైనా, పెద్దదైనా.. అందులో ఫార్మసిస్ట్ తప్పనిసరి. ఔషధాల వినియోగం వంటి విషయాలు తెలియజేస్తూనే.. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఇవ్వాలి. కానీ, డాక్టర్ చీటీ లేకుండానే ఎవరు అడిగినా మందులు ఇస్తున్న పరిస్థితి. కొనుగోలు చేస్తున్న దుకాణాల్లోనూ బిల్లులు ఇస్తున్న పరిస్థితి లేదు. మత్తు మాత్ర, యాంటీబయోటిక్స్ తదితర కొన్ని ప్రత్యేక మందులను అమ్మినప్పుడు షెడ్యూల్ హెచ్1 నిర్వహించాలి. వీటికి సంబంధించి.. పక్కాగా రికార్డులు ఉంచాలి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ జిరాక్స్ తీసుకోవాలి. ఇవేవీ జరగడం లేదు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల ప్రాంగణాల్లోని దుకాణాల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉంది. మరికొన్ని చోట్ల బ్రాండెడ్ మందుల బదులు.. అదే ధరకు జనరిక్ అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా.. నెలకు పది నుంచి 20 కేసులు నమోదు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

ఉల్లంఘిస్తే కేసులు

వీరకుమార్, ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు

జిల్లా వ్యాప్తంగా ఔషధ దుకాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నెల్లూరు, కావలిలో ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. కొన్నింటిపై కేసులు నమోదు చేశాం.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో ఆత్మకూరు గ్రామీణ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రెసిడెన్సియల్ కళాశాలు, స్కిల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఆలయాల మరమ్మతులకు ఒక్కో ఆలయానికి రూ.5లక్షలు అందజేస్తామన్నారు. పారదర్శకంగా మద్యం టెండర్లు నిర్వహించినట్లు వివరించారు. ఈ సమావేశంలో కిమ్స్ ఈడీ గిరినాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు సబ్‌డివిజన్‌లో 58 విద్యుత్తు నియంత్రికలు చోరీ

పొదలకూరు, న్యూస్‌టుడే: డిస్కం సబ్‌డివిజన్ పరిధిలోని పొదలకూరు, విరువూరు, మనుబోలు సెక్షన్లలో 58 విద్యుత్తు నియంత్రికలను గుర్తు తెలియన వ్యక్తులు అపహరించారని డీఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. పొదలకూరులో గురువారం ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు సాగునీరందించే విద్యుత్తు మోటార్ల నియంత్రికలు చోరీకి గురవడంతో వాటి స్థానంలో తిరిగి అమర్చేందుకు వీల్లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పొదలకూరు పరిధిలో 37, విరువూరులో ఆరు, మనుబోలు మండలంలో 15 మొత్తం 58 వరకు అపహరించారని చెప్పారు. వీటిలో పొదలకూరులో తొమ్మిది, విరువూరులో రెండు, మనుబోలులో రెండు అమర్చామని ఇంకా 45 వరకు అమర్చాల్సి ఉందన్నారు. అన్నదాతలే తమ ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రత కల్పించుకోవాలన్నారు. ఎలాంటి విద్యుత్తు సమస్యలు తలెత్తినా వెంటనే తమశాఖ సిబ్బందికి తెలియచేయాలని కోరారు. ఆయన వెంట డిస్కం ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.



పొలాల నుంచి వాయువు రావడంతో ఏర్పడిన గొయ్యి..

నేల నుంచి ఎగిసిన వాయువు

చేజర్ల, కలువాయి, న్యూస్‌టుడే: చేజర్ల, కలువాయి మండలాల సరిహద్దులోని పొలాల నుంచి ఒక్కసారిగా గాలి శబ్దం వెలికి వచ్చింది. మినుము పైరు పరిశీలించేందుకు గురువారం మధ్యాహ్నం పొలానికి వెళ్లిన చిత్తలూరు గ్రామానికి చెందిన రైతు భక్తవత్సల నాయుడు శబ్దాన్ని గమనించారు. ఒక రంధ్రం నుంచి ఎగిసి పడటాన్ని గుర్తించారు. కొన్ని గంటల పాటు వాయువు భూమి నుంచి వెలికివచ్చింది. తోటి రైతులకు విషయం చెప్పడంతో ఆసక్తిగా తిలకించారు. దీనిపై భూగర్భ జల వనరుల శాఖ డీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ... భూమి పొరల్లోకి నీరు చేరడం, ఫలకాల మధ్య సర్దుబాటు కారణంగా ఒక్కోసారి గాలి వెలుపలికి వస్తోందన్నారు. వేసవిలో నేల పగుళ్లిచ్చి ఉండటంతో వర్షంతో పైభాగం మూసుకొని పోవడం, నీరు భూమిలోకి ఇంకడంతో ఇలా జరుగుతుందన్నారు. కొంత సమయానికి గాలి రావటం తగ్గిపోతుందని పేర్కొన్నారు.

ఉచిత ఇసుకే ప్రభుత్వ లక్ష్యం



ఇసుక తవ్వకాలు చేసే రీచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో కలెక్టర్, జేసీ తదితరులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారానికి ఇసుక ధరలు సాధారణస్థితికి చేరుకోవాలని మంత్రి నారాయణ తెలిపారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లో పీకేపాడు, మినగల్లు, ఇరువూరు, పల్లిపాడు ఇసుక రీచ్‌లలో కూలీల ఖర్చులు, లోడింగ్, రవాణా ఛార్జీలు తదితర వాటిపై దాఖలైన టెండర్ల పరిశీలన కార్యక్రమం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం రవాణా ఖర్చులు భరిస్తూ ఇసుకను ఉచితంగా ఇవ్వాలనే ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం పది స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణ

నగరాభివృద్ధికి సహకరించాలి.. కోవూరు, పెన్నానదిలో ప్రారంభం కానున్న ఇసుక రీచ్‌లను కలెక్టర్‌తో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో అయిదు రోజుల్లో ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. నెల్లూరు నగరంలోని కాలువల్లో పూడికలు తీయడం వల్లే ఎక్కడ కూడా వరద నీరు ఆగలేదన్నారు. ముఖ్యంగా రూ.54 కోట్లతో నగరంలో డ్రైన్లు డిజైన్ చేయమని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అనంతసాగరం, న్యూస్‌టుడే: లబ్ధిదారులు.. ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అన్నారు. గురువారం రేవూరు, దేవరాయపల్లి బిట్-1, అనంతసాగరం తదితర గ్రామాల లేఅవుట్‌లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్లాబ్ దశలో ఉన్న గృహాలను డిసెంబరు లోపు, పునాది దశలో ఉన్నవి వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణం కోసం పొదుపు రుణాలు పొందవచ్చన్నారు. ఇంటి పట్టా, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే. . విద్యుత్తుశాఖ ఉచితంగా మీటరు ఏర్పాటు చేస్తుందన్నారు. హౌసింగ్ ఏఈ శరత్, ఏపీవో దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి రైలు వేళల్లో మార్పు

బిట్రగుంట, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్లే (12710) సింహపురి సూపర్‌ఫాస్ట్ రైలు వేళల్లో రైల్వే శాఖ స్వల్ప మార్పు చేసింది. శుక్రవారం రాత్రి నుంచి అమలులోకి వస్తున్నట్లు ఆయా స్టేషన్లకు సమాచారం అందింది. సికింద్రాబాద్‌లో రాత్రి 11:05 గంటకు బయలుదేరాల్సిన రైలు ఇక నుంచి రాత్రి 10:05 గంటలకు కదులుతుందని పేర్కొన్నారు. కావలికి శనివారం ఉదయం 6:59 గంటలకు వచ్చి 7:00 గంటలకు వెళుతుంది. నెల్లూరు రైల్వేస్టేషన్‌కు 7.58కి వచ్చి 8:00 గంటలకు బయలుదేరి వేదాయపాలేనికి 8:05 గంటలకు చేరుకుంటుంది. అక్కడినుంచి 8:06 గంటలకు బయలుదేరి గూడూరు రైల్వేస్టేషన్‌కు 8:55 గంటలకు చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు. దిగువమార్గంలో వెళ్లే రైలు వేళల్లో మార్పు లేదని వెల్లడించారు.

మద్యం దుకాణం వద్దని మహిళల ఆందోళన

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు రాంనగర్ గేటు సెంటరులో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ గురువారం మహిళలు, యువకులు, పెద్దలు భైఠాయించి ఆందోళనకు దిగారు. గతంలో ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఉండేదని, సాయంత్రం వేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడే వారని, తిరిగి మళ్లీ అదే పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాంనగర్ నాలుగు రోడ్ల కూడలి కేంద్రం వద్ద మద్యం దుకాణం ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. అదే సమయంలో ఈ మార్గంలో వెళుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వాహనాన్ని నిలిపి వినతి పత్రాన్ని అందజేశారు. సోమిరెడ్డి సానుకూలంగా స్పందించి మహిళలకు మద్యం దుకాణం వల్ల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అక్కడే ఉన్న పోలీసులను ఆదేశించారు. స్థానికులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేయకముందే కలెక్టరు, తహసీల్దారు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఇళ్ల మధ్య కాకుండా గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డికి సమస్య వివరిస్తున్న మహిళలు

సీబీఐ పేరుతో నగదు ఇవ్వాలని బెదిరింపు

బిట్రగుంట, న్యూస్‌టుడే: సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని. . అర్జెంటుగా నగదు ఇవ్వాలని బోగోలులో నడక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.శ్రీనివాసులును ఫోన్‌లో బెదిరించాడు. నీ కుమారుడు ముగ్గురు ఆడపిల్లల్ని వేధిస్తున్నాడు. మా కస్టడీలో ఉన్నాడు. వెంటనే ఫోన్ పే లేదా గూగుల్ పేలో రూ.40 వేలు జమ చేయాలని చెప్పాడు. దీంతో కంగారుపడిన అతను నాకు హిందీ రాదని, ఆంగ్లంలో మాట్లాడాలని కోరగా నిరాకరించాడు. ఆలస్యమైతే కేసు నమోదు చేస్తాం.. మీ అబ్బాయి జీవితం నాశనమైపోతుందని హెచ్చరించాడు. ఆందోళనకు గురై హిందీ వచ్చిన ఓ యువకుడి వద్దకు వెళ్లి మాట్లాడించగా మరింత కటువుగా వ్యవహరించాడు. దీంతో నా కుమారుడు ఏ తప్పు చేయడు.. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో.. డబ్బులు ఇచ్చే ప్రసక్తే లేదని శ్రీనివాసులు ఫోన్ కట్ చేశారు. ఆయన వెంటనే తన కుమారుడికి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడిగితే విధుల నుంచి ఇప్పుడే హాస్టల్‌కు వచ్చానని బదులివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఫేక్ కాల్ అని నిర్ధారణకు వచ్చారు. ఈఘటన గురువారం ఉదయం 11:11 గంటలకు జరిగింది. కొద్ది రోజుల కిందట స్థానిక వ్యాపారికి ఇదే తరహాలో సీబీఐ అని చెప్పి ఫోన్‌కాల్ వచ్చింది. వాళ్లను కూడా రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నువ్వు ఎవరు.. ఎందుకు ఫోన్ చేశావని అడగడంతో సమాధానం చెప్పకుండా కట్ చేశారు. ఈ విషయాన్ని బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ దృష్టికి శ్రీనివాసులు తీసుకెళ్లారు. ఇలాంటి ఫోన్లకు భయపడవద్దని ఆయన చెప్పారు.



విరాళం అందజేస్తున్న జేబీ కళాశాల అధ్యాపకులు

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని జవహర్ భారతి కళాశాల అధ్యాపకులు విజయవాడ వరద బాధితులకు సహాయం కోసం రూ.లక్ష విరాళాన్ని సేకరించారు. గురువారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి ఈ మొత్తాన్ని అందజేశారు. జేబీ అధ్యాపకులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యంనాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి, భాజపా పట్టణాధ్యక్షులు బ్రహ్మానందం, బ్యూలా, శామ్యూల్‌రాజు, నాగేశ్వరరావు, అయబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డేవిస్‌పేట, ఇందుకూరుపేటలోని సచివాలయాల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా టీకాలు వేస్తున్నారా లేదా అనే విషయాన్ని వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సంచార జాతుల గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, వారందరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించాలని సూచించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ.7,375
సవర ధర:	రూ.59,000
వెండి గ్రాము :	రూ.96.70

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	129
రిటైల్	151
లేయర్	120
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	249
లేయర్ మాంసం	204
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	140
లేయర్	120
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	204

ప్రత్యేకత.. అదే ఘనత

విశ్రాంత జీవితంలో అన్ని రంగాల్లో రాణిస్తున్న రాఘవ

ఉపాధ్యాయుడిగా పనిచేసి 29 ఏళ్లుగా విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న ఆయన.. అవిశ్రాంతంగా అభిరుచి ఉన్న రంగాలకు సేవలు అందిస్తున్నారు. టీచర్‌గా విద్యార్థులను తీర్చిదిద్దడమే కాదు.. ఉత్తమ నటుడు, రచయిత, దర్శకుడిగా, నాటక న్యాయ నిర్ణేతగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు. ఆయనే సీఆర్ రాఘవ.




ప్రముఖుల ద్వారా సత్కారం అందుకుంటూ..

న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం)

నెల్లూరు లెక్చరర్స్ కాలనీకి చెందిన రాఘవ 35 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 65 ఏళ్లుగా నాటకరంగంలో ప్రత్యేకతను చాటుకుంటూ పురస్కారాలు అందుకోవడంతో పాటు వృత్తిరీత్యా విద్యార్థులను ప్రోత్సహించడంలో ముందు నిలిచారు. అభినయ ఆర్ట్స్ ద్వారా పలు నాటికల ప్రదర్శనకు అవకాశం కల్పించడమే కాదు.. కళారంగంలో ప్రముఖులను సత్కరించి ప్రోత్సహిస్తున్నారు. ఆయన నెలకొల్పిన అభినయ ఆర్ట్స్ పదో వార్షికోత్సవాన్ని 88 ఏళ్ల వయసులో ఈ ఏడాది మేలో విజయవంతంగా నిర్వహించారు. ఆయన దర్శకత్వంలో 'తుపాను' నాటికను ప్రదర్శించి.. అందులో కీలక పాత్ర పోషించారు.

రచయితగా..

'అభినయ దీపిక'తో పాటు 'భవబంధాలు', 'వాత్సల్య భారతి' నాటకాలు, 'శృతిలయ', 'కుంటిమేకపిల్ల', 'భువనఘోష', 'తారు మారు' నాటికలు, 'మానవతి', 'మనసులు మారాయి', 'వెండితెర' వంటి సినీ కథలు రచించారు. 'సామాజిక స్పందనలు' కథానిక, 'మహాత్మా జ్యోతిరావు పులే, సావిత్రి బాయి పులే సంక్షిప్త చరిత్రలు, 'అవినీతి రహిత సమాజం కోసం' అనే రచనలు చేశారు. ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.



పురస్కారాలు

ఉపాధ్యాయుడిగా పనిచేసిన మడమనూరులో యంగ్‌మ్యాన్ అసోసియేషన్‌ను, మనుబోలులో రవీంద్ర కళామందిర్‌ను ఏర్పాటు చేసి ప్రదర్శనలిచ్చారు. ఉత్తమ రచయిత, నటుడు, దర్శకుడిగా లెక్కకు మిక్కిలి పురస్కారాలు అందుకున్నారు. అభినయ దీపిక రచనకు ఇంటర్నేషనల్ వాకర్స్ వారి ఉత్తమ రచయిత అవార్డు అందుకున్నారు.

అప్పుడే సార్థకత

ఉద్యోగంతో సరిపెట్టుకోకుండా ఆసక్తి ఉన్న రంగాలలో ప్రత్యేకత చాటుకునేందుకు ప్రయత్నిస్తే జీవితానికి సార్థకత చేకూరుతుంది.

– సీఆర్ రాఘవ

అందుబాటులో ఎరువులు

దుత్తలూరు, న్యూస్‌టుడే : శనగ సాగు చేసే రైతులకు ఈ ఏడాది 25 శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, చరవాణి నంబరుతో సమీప రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 30వ తేదీలోగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

కావలి : పట్టణంలోని ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. ఎనిమిది అడుగులు మాత్రమే రహదారికి ఇరువైపులా తోపుడుబండ్లు, ఇతర చిరు వ్యాపారులకు అవకాశం కల్పించారు. అంతకు మించి వచ్చిన వాటిని తొలగించారు.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

22 నుంచి ఆధార్ శిబిరాలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆధార్ సేవలు సంబంధించి ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న కోటారెడ్డినగర్, ఉప్పుచెరువు, 23న కోటువారివీధి, తూర్పుపడ్డపాలెం, 24న గుర్రంవారిపాలెం, బిలాల్‌నగర్, 25న సంతోష్‌నగర్, యర్రపడ్డపాలెం సచివాలయాల వద్ద ఆధార్ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కోరం లేక మండల సభ వాయిదా

వింజమూరు, న్యూస్‌టుడే : కోరం లేకపోవడంతో మండల సభ వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 మంది ఎంపీటీసీ సభ్యులకు ఇద్దరే హాజరయ్యారన్నారు. ఎంపీపీ ఇనగనూరు మోహన్‌రెడ్డి కూడా హాజరుకాకపోవడంతో వాయిదా వేశామన్నారు.

స్థానికంగా ఉండరు.. సమస్యలు పట్టించుకోరు



ట్యాంక్ సెంటర్‌లో అధ్వానంగా రోడ్డు

న్యూస్‌టుడే, అల్లూరు

అధికారులు, నాయకులు స్థానికంగా నివాసం ఉండకపోవడంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు సమస్య మొరపెట్టుకున్నా ఆలకించడం లేదు. అల్లూరులో మిట్ట పంట కాలువ పూడికతో నిండిపోయింది. దీన్ని బాగు చేయాలని రైతులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. స్పందన కనిపించలేదు. మరోవైపు సీజను సమీపిస్తుండడంతో చందాలు వేసుకొని యంత్రం ద్వారా పూడిక తీయించారు. దీనికి గ్రామంలోని ఇళ్ల నుంచి మురుగునీరు వెళ్లేలా అనుసంధానం చేశారు. ఇందులో ప్లాస్టిక్ వ్యర్థాలు, రాళ్లు, సీసాలు తదితరాలు వస్తున్నాయి. పైగా దుర్గంధం వెదజల్లుతోంది. ఈనీరు పంటలకు పెట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అల్లూరుపేటలో ఏడేళ్లుగా పైపులైనుకు లీకు పడి తాగునీరు వృథాగా పోతోంది. దీంతో ప్రజలు, సమీప ఇళ్ల వారు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. రహదారి నీటితో నిండిపోతోంది. స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుపోయినా సమస్య పరిష్కారం కాలేదు. నగర పంచాయతీలో దోమల నివారణకు ఫాగింగ్ చేసి దాదాపు సంవత్సరం గడిచింది. వీటి దాడితో రాత్రి సమయంలో ప్రజలు నిద్రకు దూరమవుతున్నారు. పంట కాలువలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేసినా అడ్డుకోవడం లేదు. ఈ విషయమై అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరావును వివరణ కోరగా స్థానికంగా ఉండేందుకు ఇల్లు చూస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సర్కారు భూమేగా.. పాగా వేద్దాం!



బత్తినవారిపల్లెలో సాగుకు సిద్ధం చేసిన మేత భూమి

న్యూస్‌టుడే, వింజమూరు

పట్టణంలోని పాతూరు చెరువు లోతట్టు ప్రాంతంలో ఆక్రమార్కులు ఆక్రమించి ఇళ్లు కట్టారు. వీటిని తొలగించేందుకు సర్వే చేసి మూడేళ్లయినా ఇప్పటికీ చర్యలు లేవు. కాలువల్లో కూడా నిర్మాణాలు వెలశాయి. ఊటుకూరు, బుక్కాపురం, బత్తినవారిపల్లె, కాటేపల్లి, తక్కెళ్లపాడు చెరువుల లోతట్టు ప్రాంతాలు పరాధీనమయ్యాయి. బుక్కాపురం చెరువు లోతట్టు ప్రాంతంలో సుమారు 30 ఎకరాల్లో బోర్లు వేసి విద్యుత్తు లైను ఏర్పాటు చేసుకుని మొక్కజొన్న, మినుము, పత్తి వంటి పైర్లు సాగు చేస్తున్నారు. బత్తినవారిపల్లి చెరువులోపల 70 నుంచి 80 ఎకరాల్లో జామాయిల్ వేశారు. సర్వే నంబరు 329లో మేత పోరంబోకు భూమి 181 ఎకరాలు ఉండగా గతంలో 15 ఎకరాల్లో జామాయిల్ వేశారు. తాజాగా మరో పదెకరాల్లో వేసేందుకు దున్ని సిద్ధం చేశారు. చంద్రపడియ చెరువులో సుమారు 15 ఎకరాల్లో జామాయిల్ సాగు చేయడంతో వివాదం జరుగుతోంది. ఊటుకూరులో 30 ఎకరాల్లో రెండు నెలల క్రితం జామాయిల్ మొక్కలు నాటారు. తక్కెళ్లపాడులో సుమారు 30 ఎకరాలు కొందరు ఆక్రమించి మినుము సాగు చేస్తున్నారు. ఇవన్నీ బడా రైతుల అధీనంలో ఉన్నాయి. చెరువు ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేయకుండా గతంలో కొందరు అడ్డుకోవడంతో ఆక్రమ ఇల విషయమై ఫిర్యాదు చేస్తే అధికారులు సర్వే చేసి కర్రలు పాతారు. జీవాలు, పశువులు తిరిగేందుకు కూడా అవకాశం లేకుండా కొంత పోరంబోకు స్థలాలు కూడా ఆక్రమిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఎక్కడైనా సొంత భూమి ఉంటే రక్షణ కంచె వేస్తారు. ఎవరూ ఆక్రమించకుండా కాపాడుకుంటారు. ఇలాగే చేయాల్సిన అధికారులు ప్రభుత్వ భూముల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమ విధి కాదన్నట్లుగా నడుచుకుంటున్నారు. సరిగ్గా ఇలాగే వ్యవహరించడంతో వింజమూరులో భూములు పరాధీనమవుతున్నాయి.



చెరువులో పెంచుతున్న జామాయిల్ తోట

తొలగింపునకు చర్యలు

ఎస్‌కె హమీద్, తహసీల్దారు, వింజమూరు

చెరువు లోతట్టు ప్రాంతాలు ఆక్రమణలకు గురైన విషయమై సమాచారం లేదు. సర్వే చేయించి తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. త్వరలో అన్ని రకాల ఆక్రమణలు తొలగిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటితోపాటు ఇళ్లలోని మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. - **శ్రీనివాసులు,**

సమాధానం : శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **నజీముల్లా, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, దుత్తలూరు**

? పట్టణంలోని ఇందిరానగర్ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. - **ఆర్.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, ఇందిరానగర్**

✓వీధి దీపాల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తాం. **శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి - న్యూస్‌టుడే, కావలి**

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

లింగసముద్రం, న్యూస్‌టుడే: అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహమ్మద్ సుభాని పేర్కొన్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దిమ్మె శిథిలం.. కూలితే ప్రమాదం

ఇది పట్టణంలోని ముసునూరులో విద్యుత్తు నియంత్రిక కింద ఉన్న శిథిలమైన దిమ్మె. దీంతో ఇది కూలిపోయే ప్రమాదం ఉంది. దీన్ని తొలగించి తిరిగి నిర్మించాల్సి ఉంది. లేకుంటే ప్రమాదం జరిగే ఆవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఎస్పీడీసీఎల్ కావలి గ్రామీణ సహాయ ఇంజినీర్ చేబ్రోలు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. - **న్యూస్‌టుడే, కావలి**



రాత్రిళ్లు భయం... భయం



దుత్తలూరు సెంటర్ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. అడుగడుగునా గుంతలు పడ్డాయి. వీటిలో వర్షానికి నీరు చేరుతోంది. రాత్రిళ్లు ఈ రహదారిపై వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని పీఆర్ ఏఈ రవీంద్రనాథ్ తెలిపారు. - **న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి**

కిటికీలూ బాగు చేయించుకోలేరా?

మండల పరిషత్ కార్యాలయ భవనం కిటికీల నుంచి వర్షపు నీరు గదుల్లోకి వస్తోంది. దాంతో సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలు పాడై ముట్టుకుంటే పడిపోయేలా ఉన్నాయి. కొత్తవి ఏర్పాటుచేయకుంటే అనేక విధాలుగా ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ విషయమై పీఆర్ ఏఈ రవీంద్రను వివరణ కోరగా భవనం దుస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. - **న్యూస్‌టుడే, కలిగిరి**



పొంగుతున్న వాగులు



భారీ వర్షాలకు గురువారం మండలంలోని చిప్పలేరు, నేరేళ్ల, ఉబ్బల, చీకటి వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. మూడు రోజుల క్రితం చుక్క నీరు లేని జలదంకి, లింగరాజు అగ్రహారం, హనుమకొండపాలెం, గట్టుపల్లి, దాసరి అగ్రహారం, తిమ్మసముద్రం చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చినక్రాక రిజర్వాయర్ నిండి కలుజులు పారడంతో ఈ ఏడాది పంటల సాగుకు ఇబ్బంది లేదని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, జలదంకి**

సాగు నీరు వృథా

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మాచవరం చెరువుకు వచ్చిన సాగునీరు పెద్దతూము నుంచి వృథాగా పోతోంది. ఏడాది తర్వాత అరకొరగా చెరువులోకి నీరు చేరుతుంది. తూములకు ఏర్పాటు చేసిన తలుపు దగ్గర లీకులు ఏర్పడడంతో నీరు పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ సీతారామయ్యను వివరణ కోరగా పరిశీలించి తూము తలుపును సరిచేయిస్తానన్నారు.
- **న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**



పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

వింజమూరు : స్థానిక ప్రధాన రహదారిలో వర్షాల నేపథ్యంలో పేరుకుపోయిన చెత్త తొలగించే పనిని పంచాయతీ సిబ్బంది గురువారం చేపట్టారు. సర్పంచి ఎన్. సుజన మాట్లాడుతూ శుక్రవారం నుంచి అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పొడి చల్లి, మురుకాలువల్లో ఎబేట్ మందు పిచికారీ చేయిస్తామన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలతో ఎరువుల వినియోగం

సీతారామపురం : వ్యవసాయాధికారుల సూచనలతో ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. మండలంలోని దేవమ్మ చెరువు, వేంపల్లితోకలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వలేటివారిపాలెం : వ్యవసాయంలో ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించగలుగుతారని ఏవో హేమంత్ భరత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని శామీరపాలెం, పోలినేనిపాలెం రైతు సేవా కేంద్రాలల్లో ఏవో ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. విత్తన శుద్ధి, అంతర్ పంటల సాగు, నూతన వంగడాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

వైభవంగా ప్రసన్నుడి గరుడ సేవ

బిట్రగుంట, : బిలకూట క్షేత్రం కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామికి పౌర్ణమి గరుడ సేవ గురువారం రాత్రి వైభవంగా జరిగింది. గరుడ వాహనంపై స్వామికి ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు పూజలు నిర్వహించారు. వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బావులు ఇలా.. రక్షణ ఏదీ?



కావలి అంబేడ్కర్‌నగర్‌లో తాగునీటి బావి

న్యూస్‌టుడే, కావలి

పట్టణంలోని బావుల వద్ద రక్షణ చర్యలు కరవయ్యాయి. దీంతో వీటిని పలువురు పూడ్చి ఆక్రమిస్తున్నారు. మరోవైపు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పట్టణంలో పురాతన కాలంలో తాగునీటి అవసరాల కోసం వీటిని తవ్వించారు. కాలక్రమంలో రక్షిత పథకాలు రావడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. పట్టణం విస్తరించడంతో స్థలాలకు విలువ పెరిగింది. అక్రమార్కులు వీటిపై కన్నేశారు. పూడ్చి నిర్మాణాలు చేసి హస్తగతం చేసుకుంటున్నారు. అయినా వీటి పరిరక్షణకు పుర అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రతిపాదనలతో కాలం గడుపుతున్నారు.

మెష్‌లు ఏర్పాటు గాలికి..

పట్టణంలో 50కి పైగా బావులు ఉన్నాయి. వీటికి రక్షణగా గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల అక్కమ్మ బావిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి ఘటనలు జరగకుండా పైకప్పుగా మెష్‌ల ఏర్పాటుకు గతంలో అంచనాలు వేశారు. అవి ఆచరణలోకి రావడం లేదు. బావి గోడపై నిత్యం యువకులు, పిల్లలు సరదాగా కూర్చుంటున్నారు. వీరు పొరపాటున వాటిలో పడే ప్రమాదం ఉంది. అంబేద్కర్‌నగర్, రామ్మూర్తిపేటతోపాటు పట్టణంలో చాలా బావులు నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వారంలోగా సరిదిద్దుతాం : శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం

బావులకు మెష్‌ల వంటి ఏర్పాట్లపై ఇప్పటికే అంచనాలున్నాయి. వారం రోజుల్లోగా నాలుగు బావులపై రక్షణ చర్యలు చేపడతాం.

విద్యుదాఘాతంతో మృతి

లింగసముద్రం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంగళాపురంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం ఎలిపాటి శ్రీను(48) పక్క ఇంటిలో విద్యుత్తు సర్వీసు వైరు కిందపడడంతో దానిని సరిచేసేందుకు వెళ్లి వైరును పట్టుకున్నారు. దీంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయారు. చికిత్స నిమిత్తం కందుకూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కనిపించడం లేదంటూ ఫిర్యాదు

ఉలవపాడు, న్యూస్‌టుడే: తన భర్త, కుమార్తె కనిపించడం లేదంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు రామాయపట్నం గ్రామానికి చెందిన బిల్లా కిషన్, ఆరేళ్ల వయసు ఉన్న తన కుమార్తె ఆనందిజాస్మిన్‌తో కలిసి బజారుకు వెళ్లొస్తామని చెప్పి ఈనెల 11న బయటకు వెళ్లారు. అప్పటి నుంచి వారు కనబడడం లేదు. బంధువుల గ్రామాల్లో విచారించినా.. ఆచూకీ తెలియలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కిషన్ భార్య మౌనిక ఫిర్యాదు చేశారు. ఆమేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాచకుడిపై దాడి

నెల్లూరు (వేదాయపాలెం) : యాచకుడిపై వ్యాపారి దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక అర్చన థియేటరు ఎదురుగా ఫాస్ట్‌ఫుడ్స్ దుకాణం ఉంది. అదే ప్రాంతంలో చెత్తాచెదారం, వ్యర్థాలు ఏరుకునే నాగరాజు భోజనం కావాలని రూ.50 ఇచ్చాడు. తగిన నగదు తీసుకురావాలంటూ దుకాణం యజమాని పైప్ తీసుకుని తలపై కొట్టడంతో రక్తస్రావమైంది. ఇది గుర్తించిన అటుగా వెళ్లే ప్రజలు దుకాణ యజమానిపై గొడవకు దిగారు. అనంతరం 108కు పిలిపించి బాధితుడిని ఆసుపత్రికి తరలించారు.

ఈమార్గంలో వెళ్లేదెలా?



మండలంలోని లెక్కలవారిపాలెం నుంచి వింజమూరు-ఆత్మకూరుకు వెళ్లే లింకు రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు రెండు కి.మీ. నిడివి గల ఈ మార్గం వెళ్లేందుకు ఏమాత్రం అనుకూలంగా లేదు. గ్రామస్థులు పొలాలకు కూడా ఇదే రహదారిన వెళ్లాలి. పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) జేఈ ప్రసాద్ మాట్లాడుతూ వీఎంజీఎస్‌వై కింద తారు రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతి రాగానే చేస్తామన్నారు. న్యూస్‌టుడే, వింజమూరు

వాల్మీకి మహర్షికి ఘన నివాళి

ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు,న్యూస్‌టుడే : కందుకూరు పట్టణం: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు గురువారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ కె. అనూష వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి జయంతి కార్యక్రమం ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. **గుడ్లూరు:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదికవి వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఉప తహసీల్దారు లక్ష్మీ ప్రసన్న, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఉదయగిరిలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు, ప్రజలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సుభద్ర, ఉద్యోగులు, సిబ్బంది, మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టరు కృష్ణారెడ్డి, అధ్యాపకులు నివాళులర్పించారు. సీతారామపురం ఎంపీడీవో కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్యాలయం అధికారులు, సిబ్బంది, స్థానికులు నివాళులర్పించారు. వరికుంటపాడు మండలంలోని భోగ్యంవారిపల్లెలో వాల్మీకి బోయ సంఘం నాయకులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భోగ్యం నవీన్, ఉపాధ్యక్షుడు యు.మోహన్‌రాజా, మండల గౌరవాధ్యక్షులు భోగ్యం వెంగయ్య, మండల అధ్యక్షుడు భోగ్యం మార్కండేయులు, ఉపాధ్యక్షుడు సుర్తినేని శివరామయ్య, పాల్గొన్నారు.

చెరువులకు వరద నీరు

ఉలవపాడు మండలంలోని చెరువులకు కొద్దికొద్దిగా నీరు చేరుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు ఉప్పుటేరు నిండుగా ప్రవహిస్తూ బద్దిపూడి వద్ద మన్నేరులో కలుస్తుంది. దీంతో కరేడు చెరువుకు, చాకిచర్లలోని గోగుల, జమ్ములచెరువుకు నీరు చేరుతోంది. - **న్యూస్‌టుడే, ఉలవపాడు**



వైభవంగా ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠ

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణపురంలోని మాధవయ్య స్వామి ఆలయంలో విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ చౌదరి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వేణుగోపాల్, తిరుపతయ్య, తెదేపా మండల అధ్యక్షుడు హనుమంతరావు, నాయకులు శ్రీహరినాయుడు, శ్రీనివాసులు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లె ప్రగతికి కృషి: కాకర్ల

కొండాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పల్లె పండుగ కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా జరుగుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఉప్పులూరు, గొట్టిగుండాల, చింతలదేవి పంచాయతీలో గురువారం సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప్పులూరు సర్పంచి వలేటి కొండలరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు గోరంట్ల నరసింహులు, రామ్మోహన్‌రావు, నాయకులు యారవ కృష్ణయ్య, మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు దామా మహేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకే కూటమి ప్రభుత్వం పల్లె పండగ వారోత్సవాలు చేపట్టిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని బడేవారిపాలెంలో రూ.58 లక్షలు, పోకూరు రూ.25లక్షలు, శాఖవరంలో రూ.31 లక్షలతో సిమెంటు రహదారుల నిర్మాణానికి శిలా ఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 187 పనులకు రూ.17 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. పీఆర్ డీఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నరేంద్రదేవ్, మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

కందుకూరు పట్టణం : ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలు కలెక్టరేట్‌లో గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు శాఖలకు సంబంధించి ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉండటంతో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ తెలిపారు.

పారిశుద్ధ్యం అధ్వానం - రోగాల భయం

న్యూస్‌టుడే, దుత్తలూరు, వరికుంటపాడు

జిల్లాలో ఎడతెరిపి లేకుండా మూడురోజులు వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. రోగాలు ఎక్కడ ప్రబలుతాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, జలదంకి తదితర మండలాలుండగా 143 పంచాయతీలున్నాయి. 200లకు పైగా మజరా గ్రామాలున్నాయి.

ఇలా చేస్తే..

రోగాలు ప్రబలక ముందే గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడంతోపాటు మంచినీటి పథకాలు, కుళాయిల వద్ద నీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రహదారులు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో త్వరితగతిన బ్లీచింగ్ పౌడర్ చల్లేలా చూస్తే చాలా వరకు రోగాల బారి నుంచి కాపాడవచ్చని స్థానికులు కోరుతున్నారు.



వరికుంటపాడులో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఎక్కడ చూసినా..

రహదారులపై నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వర్షం కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం దారుణంగా ఉంది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీటితోపాటు వర్షపు నీరు ఎక్కడంటే అక్కడ చేరి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలకు పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రహదారులపైనే కాకుండా మంచినీటి పథకాలు, కుళాయిల వద్ద కూడా పారిశుద్ధ్యం లోపించింది.

మెరుగుకు చర్యలు: పద్మజ, డీఎల్‌పీవో

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీల పాలకులు, పంచాయతీ సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. నీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నీరు కలుషితం కాకుండా మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

ఘనంగా వాల్మీకి జయంతి

ఆత్మకూరు, సంగం, అనంతసాగరం, మర్రిపాడు, విడవలూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: భారతీయుల జీవన విధానానికి దిశానిర్దేశం చూపిన రామాయణాన్ని రాసిన మహర్షి వాల్మీకి చిరస్మరణీయుడని ఆర్డీవో పావని అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఎస్పీ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. సంగంలో తహసీల్దారు సోమ్లానాయక్, అనంతసాగరం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో మస్తాన్, మర్రిపాడు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు స్వప్న ఆధ్వర్యంలో జరిగాయి. విడవలూరు తహసీల్దారు కార్యాలయంలో, తోటపల్లిగూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో, బుచ్చి నగర పంచాయతీలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పలువురు నివాళులర్పించారు.

పుల్లయ్యగౌడ్ సేవలు మరువలేనివి

పొదలకూరు : తెదేపా నాయకులు, రాష్ట్ర మాజీ మార్కెటింగ్ ఉపాధ్యక్షులు ఎంపులూరు పుల్లయ్యగౌడ్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పొదలకూరు మండలంలోని మర్రిపల్లి గ్రామంలో పుల్లయ్యగౌడ్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు రామకృష్ణగౌడ్, శ్రీనివాసులురెడ్డి, శంకరయ్య గౌడ్, పెంచలయ్యగౌడ్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: బుచ్చి నగర పంచాయతీలోని కాకా కాలనీలో కాలువలు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నాం. - **రామనాయుడు, స్థానికులు**

సమస్య : బుచ్చిలోని ముంబయి జాతీయ రహదారిపై కొద్దిపాటి వర్షానికే మెయిన్‌సెంటర్‌లో నీరు నిలుస్తోంది. - **మహేష్, స్థానికులు**

సమాధానం: నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. వర్షపు నీరు నిలవకుండా చూస్తాం. - **చంద్రశేఖర్‌రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్**

? కొడవలూరు పంచాయతీలోని పీర్ల చావిడి వద్ద డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. - **షబ్బీర్, స్థానికులు**

✓ **సమాధానం:** పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - **సాయిప్రసాద్, ఈవోపీఆర్డీ**

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



కోవూరులో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని, కోవూరు మండల పరిధిలోని గ్రామాల్లో రూ. కోటి 18 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆమె శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవూరులో రూ. 55 లక్షలు, పోతిరెడ్డిపాళెంలో రూ. 8.5 లక్షలు, పడుగుపాడులో రూ. 22 లక్షలతో సిమెంటు రోడ్లను అత్యవసర ప్రాతిపదికన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో బుచ్చి-ఊటుకూరు రోడ్డు విస్తరణకు రూ.49 కోట్ల నిధులు కేంద్రం నుంచి మంజూరు చేయించారన్నారు. ఇందుకూరుపేట మండలం మైపాడు పడమరపాలెంలో 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బంగారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వంతెనల పరిశీలన

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని బొగ్గేరు, కేతామన్నేరు, డి.సి.పల్లి వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఉన్న సోమశిల ఉత్తర కాలువ వంతెనలను గురువారం తెలుగుగంగా ఎస్‌డీసీ ప్రేమ్‌కుమార్, తహసీల్దారు స్వప్న పరిశీలించారు. వంతెనల వద్ద వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తూ రాకపోకలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని పరిశీలించారు.

ఇక్కడ.. మీ పిల్లలైతే ఉంటారా..!

వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు



శిథిల భవనంలో పెచ్చులూడి బయటపడిన కమ్ములు

న్యూస్‌టుడే, కోవూరు, బుచ్చి: గతంలో ఆ వసతి గృహంతో వందలాది మంది విద్యార్థులతో కళకళలాడేది... ఇక్కడ చదివిన ఎంతో మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత కనీస వసతులు కల్పించలేదు. వివిధ రకాల సమస్యలతో చేరేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు బస చేసేందుకు కూడా కనీస వసతుల్లేక అల్లాడుతున్నారు.. పలు సమస్యలతో సతమతమవుతూ సర్దుకుపోతున్నామని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

కనీస వసతులు లేకపోవడంతో..

కోవూరు మండలంలోని పాటూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 63 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఇక్కడ గతంలో ఉన్న పురాతన వసతి గృహ భవనం పూర్తిగా శిథిలంగా మారింది. 2005లో అప్పటి ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి భోజనం చేసేందుకు భవనం నిర్మించారు. అక్కడే బస చేస్తూ నిద్రిస్తున్నారు. ఉన్న కొద్ది పాటి స్థలంలోనే బియ్యం బస్తాలు, ఇతర సామగ్రి ఉంచడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. శిథిల భవనం వంట గదిగా ఉపయోగిస్తున్నారు. పైభాగం మొత్తం శిథిలంగా మారడంతో కమ్ములు బయటకు రావడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



ధ్వంసమైన మరుగుదొడ్ల తలుపులు

విద్యుత్తు తీగలతో ప్రమాదం పొంచి ఉన్నా..

వర్షాకాలం కావడంతో ఎక్కడ శిథిలాలు పడి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. పురాతన భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు. మరుగు దొడ్ల తలుపులు ధ్వంసమవగా, విద్యుత్తు తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. వైకాపా పాలనలో అప్పటి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నేను త్వరలోనే పాటూరు వసతి గృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడతా. మెరుగైన వసతులు కల్పించేలా ఉన్నతాధికారులతో చర్చిస్తా. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా. విద్యార్థులు శిథిల భవనాల వద్దకు వెళ్లకుండా సంక్షేమాధికారి చర్యలు తీసుకునేలా ఆదేశిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

–వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

తీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

సంగం, కొడవలూరు, న్యూస్‌టుడే: పెన్నానది తీర ప్రాంత గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమితులైన వారు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, పశువైద్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు రమేష్ నాయక్ గురువారం సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పెన్నానది తీరంలో తొమ్మిది గ్రామాలున్నాయన్నారు. కొడవలూరు మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు పొర్లుకట్టల స్థితిగతులు, పెన్నానది వరద ప్రవాహం ప్రాంతాలను పరిశీలించారు.

అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెం: నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు తొమ్మిదో వార్డులోని పలువురు నిరుపేదలు ఇబ్బందులు పడ్డారు. కౌన్సిలర్ శివకుమార్‌రెడ్డి సహకారంతో కోఆప్షన్ సభ్యులు దస్తగిరి పేదలకు అన్నదానం నిర్వహించారు.

పొంచి ఉన్న ప్రమాదం



అల్లూరు మండలం బీరంగుంట వద్ద ఇటుక బట్టీల సమీపంలో విద్యుత్తు స్తంభం మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి. స్థానికులు స్తంభం ఒరిగిపోకుండా నిచ్చెన ఉంచారు. ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. డిస్కం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

అలంకారప్రాయం



మండల పరిధిలోని కంటేపల్లిలో గ్రామ సచివాలయం సమీపంలో గొలగమూడి రహదారి పక్కన ఏర్పాటు చేసిన బోరు చాలా కాలం క్రితం మరమ్మతులకు గురైంది. అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోలేదు. ఎంపీడీవో కల్పన స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పంపి మరమ్మతులు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వెంకటాచలం**

వ్యవసాయ పనులకు సిద్ధం



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెట్టప్రాంతంలోని పలు చెరువునీరు చేరింది. కల్యాణపురం అంకయ్యగౌడ్ చెరువు కలుజు పారడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. చెరువుల్లో సగానికి పైగా నీరు చేరిందని అధికారులు పేర్కొన్నారు. నిమ్మతోటలకు ఎంతో ఉపయోగపడుతుందని చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పొదలకూరు, కొడవలూరు**

పైడేరు వాగు గండి పూడ్చివేత



విడవలూరు మండలం గాదెలదిన్నెలో భారీ వర్షాలకు పైడేరు వాగుకు గండి పడటంతో అధికారులు అప్రమత్తమై జేసీబీ యంత్రంతో మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. గండి పూడ్చకుంటే పొలాలు ముంపునకు గురయ్యేవని రైతులు పేర్కొన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేశ్‌కుమారి స్థానికులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, విడవలూరు**

1676 మెట్రిక్ టన్నుల ఇసుక తరలింపు



కోవూరు సహకార చక్కెర కర్మాగారం వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు నుంచి గురువారం ఒక్క రోజు 1676 మెట్రిక్ టన్నుల ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించినట్లు తహసీల్దారు నిర్మలానంద బాబా తెలిపారు. వర్షాలతో పోతిరెడ్డిపాళెం వద్ద పెన్నానదిలో నుంచి డంపింగ్ కేంద్రానికి ఇసుకను తరలించలేదన్నారు. ఇక్కడ నిల్వ ఉన్న ఇసుకను మాత్రమే తరలిస్తున్నామన్నారు. **- న్యూస్‌టుడే, కోవూరు**

వాన తగ్గింది.. వరద పెరిగింది

చేజర్ల, న్యూస్‌టుడే: నల్లవాగు ప్రవాహం కారణంగా మండలంలోని నాలుగు గ్రామాలకు మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం రాత్రి నుంచి వర్షం తగ్గినా ఎగువన ఉన్న కాలువల నీరు నల్లవాగు వైపు మళ్లించటంతో గురువారం ఉదయం నుంచి వాగులో ప్రవాహం పెరిగింది. ఫలితంగా తూర్పుకంభంపాడు, ఎనమదల, బిల్లుపాడు, కోటితీర్థం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు చేజర్ల నుంచి దారి లేక పోవటంతో వరి కోత యంత్రాలు, లారీలు నిలిచిపోయాయి. వెదనపర్తి చెరువు నుంచి వచ్చే నీటిని దక్షిణకాలువకు మళ్లిస్తే నల్లవాగులో ప్రవాహం తగ్గటంతో పాటు దిగువన ఉన్న చెరువులు నిండుతాయని మండల ప్రజలు చెబుతున్నారు.



మడపల్లి -తూర్పుకంభంపాడు మధ్య రహదారికి అడ్డంగా ప్రవహిస్తున్న నల్లవాగు

ఆత్మకూరు : తుపాను కారణంగా వచ్చిన భారీ వర్షాలతో చెరువులకు నీరు చేరుతోంది. నియోజకవర్గంలోని బొగ్గేరు, కేతామన్నేరు, కొమ్మలేరు, జిల్లా వాగు, పందులవాగు, బీరాపేరులు ప్రవహించాయి. దాంతో వీటి నీరు చెరువుల్లోకి చేరింది.

కూరగాయల సాగుకు నష్టం

సంగం : భారీ వర్షాలతో మండలంలో సంగం, తరుణవాయి, పల్లిపాళెం, అనసూయనగర్, మక్తాపురం, జండాదిబ్బ గ్రామాల్లో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల సాగుకు నష్టం వాటిల్లింది. పొలాల్లో వర్షపునీరు భారీగా చేరడంతో మొక్కలు ఎండి పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



వంగతోటలో చేరిన నీరు

పునరావాస కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు : కరటంపాడు పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో పావని గురువారం పరిశీలించారు. గిరిజన కుటుంబాలతో మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో ఉంటోన్న వారికి మూడు పూటలా ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు సుధీర్, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీవో

పంట పొలాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు



కోటితీర్థంలో దెబ్బతిన్న పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చేజర్ల, న్యూస్‌టుడే: మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పైర్లను వ్యవసాయ శాఖ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో పంట సంరక్షణకు రైతుల చేపట్టాల్సిన చర్యల గురించి ఆత్మ పీడీ శివనారాయణ వివరించారు. వర్షానికి తడిచిన గింజలు మొలకెత్తకుండా ఉప్పునీటి ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. మినుము చేలల్లో కుళ్లు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి 2మి.లీ హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు వివరించారు. తడిచిన పంటను వేరుగా కోసి నూర్పిడి చేసుకుంటే ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా ఉంటోందని వారు సూచించారు.

సముద్ర ముఖ ద్వారంలో పూడికతీత



పల్లిపాలెంలో పూడిక తీయిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: రెండు వైపులా కాలువలు, తూర్పున సముద్రం ఆ గ్రామానికి సరిహద్దులు. ఎప్పుడు వర్షాలు పడిన వరదనీరు ముంచెత్తుతోంది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గంగపట్నం పల్లిపాలెం వరద నీటిలో చిక్కుకుంది. అప్రమత్తమైన అధికారులు గ్రామాన్ని పరిశీలించారు. సముద్ర ముఖ ద్వారం వద్ద జేసీబీలతో పూడిక తీత పనులు చేపట్టారు. వరద నీరు సముద్రంలోకి వెళ్లిపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. ఎప్పుడు భారీ వర్షాలు వచ్చినా తమ గ్రామానికి ప్రమాదం పొంచి ఉందని, తక్షణమే అధికారులు స్పందించి పూడిక తీయించడంతో ప్రమాదం తప్పిందని మత్స్యకారుడు నారాయణ తెలిపారు.



తలుపూరుపాడు చెరువు గట్టుపై దట్టంగా ముళ్ల చెట్లు



తొలగించిన తరువాత ఇలా..

కర్షక చైతన్యం.. చెరువు గట్టు శుభ్రం

తలుపూరుపాడు (సంగం), న్యూస్‌టుడే: రబీ సీజన్ వచ్చింది. జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు కట్టలు బలహీనంగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. తలుపూరుపాడుకు చెందిన చెరువు గట్టు మరీ అధ్వానంగా ఉండడంతో గ్రామ రైతులు ఒకటై బాగు చేసుకుంటున్నారు.

ఉనికి కోల్పోయే విధంగా..

వర్షాధారంతో పాటు, సంగం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న తలుపూరుపాడు చెరువు గ్రామానికి వరప్రసాదిని. 300 ఎకరాలకు సాగునీరందిస్తుంది. గత అయిదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో చెరువును ఎవరూ పట్టించుకోలేదు. దాంతో ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. చెరువు గట్టు దెబ్బతింది. భారీ వర్షాలు వచ్చినప్పుడు ఉత్తరం వైపు ఇప్పటికే పలుసార్లు గండి పడింది. అక్కడ మరమ్మతులు చేసేందుకు వెళ్లాలన్నా రైతులకు సాధ్యపడటం లేదు. గట్టు మీద ముళ్ల చెట్లు భారీగా ఉండటంతో చుట్టూ తిరిగి సంగం-కలిగిరి రహదారి మీదుగా ఏఎస్‌పేట మండలం హసనాపురం వైపు నుంచి వెళ్లాల్సిన దుస్థితి ఉంది. జలవనరుల శాఖ చెరువు నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

తామే స్వయంగా

ఈ దుస్థితి తొలగించేందుకు తామే ముందుకు కదలాలని కర్షకులు నిర్ణయించారు. చెరువు గట్టు మీద ముళ్ల చెట్లను తొలగిస్తే గట్టు వాస్తవ స్థితి తెలుస్తుందని, ఫలితంగా మరమ్మతులు చేసేందుకు వీలవుతుందని భావించారు. యంత్రసాయంతో చెట్లను తొలగించి గట్టును పరిశుభ్రంగా చేసుకున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

బండేపల్లిలో తాగునీటికి కటకట

మనుబోలు, న్యూస్‌టుడే : తుపాను కారణంగా విద్యుత్తు స్తంభం నేలకొరిగి సరఫరా నిలిచిపోవడంతో మూడు రోజులు నుంచి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బండేపల్లి గ్రామస్థులు వాపోయారు. గురువారం సాయంత్రం పంచాయతీ కుళాయిల ద్వారా మంచినీరు రావడం లేదని ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పొలాల్లోని విద్యుత్తు స్తంభం పడిపోయిందన్నారు. గ్రామంలో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా లేకపోవడంతో మంచినీటి పథకం పనిచేయడం లేదన్నారు. గురువారం డిస్కం సిబ్బంది మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. బోరులు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. సమీపంలోని ఓ ఫ్యాక్టరీ నుంచి వాహనాలలో నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

సోమిరెడ్డి పరామర్శ

వెంకటాచలం, న్యూస్‌టుడే: తెదేపా మండల మైనార్టీ అధ్యక్షులు షరీఫ్ తల్లి జహీరాబి మృతిచెందారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డిలు కసుమూరుకు వెళ్లి నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులున్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తమవ్వాలి

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు మండలం రామతీర్థంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి గురువారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, టీబీ పరీక్షలు, లెప్రసీ, సీజనల్ వ్యాధుల గురించి పలు రికార్డులు పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు అమరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్, శ్రావణ్‌కుమార్, సత్యనారాయణ, నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న వైద్యాధికారి

సంగం ఆనకట్ట వద్ద వరద ప్రవాహం

సంగం, న్యూస్‌టుడే: సంగం ఆనకట్ట వద్ద గురువారం వరద ప్రవాహం కొనసాగింది. బొగ్గేరుతో పాటు, పలు స్థానిక వాగుల ద్వారా ప్రవాహాలు వస్తుండటంతో ఆనకట్ట వద్ద నీటి మట్టం 8.7అడుగులకు పెరిగింది. 7450 క్యూసెక్కుల చొప్పున వారధి మీదుగా పెన్నానదిలోకి వెళుతుంది.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

రబీకి రైతులు సన్నద్ధం

సైదాపురం, న్యూస్‌టుడే: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రబీలో పంటల సాగుకు రైతులు సన్నద్ధం కావాలని వ్యవసాయాధికారిణి హైమావతి సూచించారు. మండలంలోని చాగణంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. నారుమడుల తయారీ, విత్తన ఎంపిక, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు.

సాగులో జాగ్రత్తలు పాటిస్తే దిగుబడులు

కలువాయి, న్యూస్‌టుడే: వర్షాలతో దెబ్బతిన్న పొలాలను కేవీకే సమన్వయకర్త లలిత శివజ్యోతి ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించారు. కోతకు వచ్చిన వరి పడిపోవడంద్వారా పైరు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు పాటిస్తే దిగుబడులు వస్తాయన్నారు. ఆత్మ పీడీ శివనారాయణ, కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్ నాయక్, ఏవో ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

నీటి గుండాల వద్దకు వెళ్లొద్దు

రాపూరు, న్యూస్‌టుడే: అడవులు, కొండల్లో ఉన్న నీటి గుండాల వద్దకు ఎవరూ వెళ్లొద్దని అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు అన్నారు. ఆయన సిబ్బందితో కలిసి పెంచలకోన అడవుల్లో గురువారం కూంబింగ్ నిర్వహించారు. సమీప గ్రామస్థులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోకి ఎవరైనా వ్యక్తులు వెళితే వెంటనే సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

స్వచ్ఛ ఆత్మకూరే లక్ష్యంగా ముందుకు

ముఖాముఖి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ ఆత్మకూరు ధ్యేయంగా పట్టణాన్ని అన్ని విభాగాల్లో.. అభివృద్ధి పథంలో ముందుండేలా కృషి చేస్తానని పురపాలక కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. పురపరిధిలో అవసరాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యరూపంలోకి వస్తున్న కార్యక్రమాలు తదితరాలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు. ఆ తీరు తెన్నులపై ఆయన మాటల్లోనే



గంగాప్రసాద్, కమిషనర్ ఆత్మకూరు పురపాలకం

సుందరీకరణలో భాగంగా..

స్వచ్ఛ ఆత్మకూరులో భాగంగా ప్రతి ఇంటి నుంచి పొడి, తడి చెత్తలు సేకరిస్తున్నాం. చెత్త నుంచి సంపద సృష్టిస్తాం. పట్టణాన్ని సుందరీకరించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నాం. డివైడర్‌లో ఆకర్షణీయమైన పూల మొక్కలు పెంచుతాం. సోమశిల రోడ్డు నుంచి ఎల్‌ఐసీ కార్యాలయం వరకు ఆగిన రోడ్డు విస్తరణ పనులు చేపట్టేలా కార్యాచరణ మొదలైంది. ఆత్మకూరు చెరువును సుందరంగా తీర్చిదిద్దేలా రూ. 21కోట్లతో పనులు చేపట్టనున్నాం. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఉద్యానవన పనులు పూర్తయ్యేలా చేస్తాం.

తాగునీటి అవసరాలు తీరేలా..

పురపరిధిలో తాగునీటి అవసరాలు తీరేలా.. సోమశిల నీటిని శుద్ధి చేసే యూనిట్‌ను మరొకటి ప్రభుత్వం నిర్మించనున్నది. ఈ పనులు పూర్తయితే ఆత్మకూరుకు ప్రతిరోజు తాగునీరు పూర్తిస్థాయిలో అందించాలన్న లక్ష్యం నెరవేరుతుంది. అందుకోసం రూ. 12.6కోట్లు అమృత్ -2 పథకం ద్వారా అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం టెండర్ల దశలో ఉంది.

అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి

పట్టణంలో మురుగు కాలువలు, అంతర్గత రోడ్ల సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా శివారు ప్రాంతంలో ఈ సమస్య అధికంగా ఉంది. వీటి కోసం రూ. 15.23 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నుడా నిధులు అందుబాటులోకి రానున్నాయి. వచ్చిన వెంటనే పనులు చేపడతాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

అంటువ్యాధులు ప్రబలకుండా

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఇప్పటికే మురుగుకాలువల్లో పూడికలు తీసి అడ్డంకులు తొలగించాం. నీటినిల్వ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు కార్యక్రమాలు చేపడుతున్నాం. పారిశుద్ధ్యాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి స్వచ్ఛ, ఆరోగ్యకరమైన ఆత్మకూరుగా తీర్చిదిద్దుతాం.

మురుగునీటి శుద్ధి విభాగం ఏర్పాటు

పట్టణంలోని మురుగునీటిని శుద్ధి చేసి వదిలే విభాగాన్ని నిర్మించాల్సి ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.5కోట్లతో ఈ శుద్ధి విభాగాన్ని అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం భూసేకరణ దశలో ఈ ప్రక్రియ ఉంది.

పొర్లుకట్టలు ధ్వంసం చేస్తే చర్యలు



ముదివర్తిలో పరిశీలిస్తున్న అధికారులు

విడవలూరు, : మండలంలోని పెన్నా పొర్లుకట్టలను తహసీల్దారు చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. వరదల నేపథ్యంలో పొర్లుకట్టలు బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా పొర్లుకట్టలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు. బుచ్చి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి గురువారం కేసులు నమోదు చేశారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

మనుబోలు, తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: పంచాయతీ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తున్నామని జట్లకొండూరు ఉప సర్పంచి తులసీరామ్ తెలిపారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో సర్పంచి కట్టుమూరు నాగమ్మ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

సమష్టి కృషితో విపత్తును ఎదుర్కొన్నాం: కమిషనర్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగర వ్యాప్తంగా మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు సమష్టి కృషితో సమర్థంగా సహాయ చర్యలు చేపట్టినట్లు కమిషనర్ సూర్యతేజ తెలిపారు. గురువారం అన్ని విభాగాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి, వారిని పునరావాస కేంద్రాలకు తరలించి సంరక్షించే ప్రక్రియను ఆశించిన స్థాయిలో పూర్తి చేశామన్నారు. అండర్ బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకుండా నిరంతరం మోటార్ల సహాయంతో తోడుతూ వాహనచోదకులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నగర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



కనులపండువగా అమ్మవారికి చండీహోమం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా గురువారం నెల్లూరు నగరంలోని మూలాపేట శ్రీ కంచి కామాక్షమ్మ సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో మహా చండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళి శివుడికి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి.. అనంతరం అలంకరించారు. ఆలయ మేనేజరు కె.నందకిషోర్, ఈవో ఉషాకుమారి, సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని బట్వాడిపాళెం సెంటరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దాడులు చేస్తున్నాయి. – నరహరి

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం.
– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? నీలగిరి సంఘంలో కాలువలు పూడికతో నిండిపోయి.. మురుగునీరు ముందుకు కదలడం లేదు. – హసీనా

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం.
– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? పత్తేఖాన్‌పేట అరిగెల వారి వీధికి అయిదు రోజులుగా చెత్త వాహనాలు రావడం లేదు. చెత్త పేరుకుని ఇబ్బందులు పడుతున్నాం.
–ఖలీల్, విశ్రాంత బ్యాంకు అధికారి

✓ సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం.
– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? నిప్పో ఎదురుగా సావిత్రి నగర్ నాలుగో వీధిలో వీధిదీపాలు వారం రోజులుగా వెలగడం లేదు. – మదన్‌మోహన్

✓ దీపాలు వెలిగేలా చేస్తాం.
–సూర్యతేజ, కమిషనర్

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

చదువులమ్మకు చేయూత

పూర్వ విద్యార్థుల దాతృత్వం

ఒకరు పోలీసుశాఖలో సీఐ.. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇంకొందరు వ్యాపారులు.. ఎవరికి వారు తీరిక లేకుండా ఉంటున్నారు. అయినా చదువు నేర్పిన పాఠశాల, గురువులను మరిచిపోలేదు. ఏడాదికి ఒకరోజు కేటాయిస్తూ కలుసుకుంటున్నారు. అంతేకాదు చదువులమ్మకు చేయూత నిస్తున్నారు. వారే మున్సిపల్ పాఠశాల విద్యార్థులు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (బీవీ నగర్)



పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1996-2001 వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 67 మంది 14 సంవత్సరాల తర్వాత 2015లో స్నేహితుడి వివాహంలో కలిశారు. 'మనం' పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పదో తరగతి చదివిన విద్యార్థులందరి పేర్లు సేకరించి గ్రూప్‌లో పొందుపరిచారు. అప్పటి నుంచి పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు. 2015 నుంచి పది పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా.. రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల వంతున ఏటా అందజేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న 124 మంది విద్యార్థులకు రూ.18,600తో అట్టలు, రాత పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు అందించారు. అందరూ కలిసి ఏటా విహార యాత్రలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా మేడికొండూరు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నాగూరు మీరాసాహెబ్ దగ్గరుండి ఈ యాత్రలు నిర్వహిస్తున్నారు. స్నేహితుల్లో పేదరికంలో ఉన్న పది మందికి ఆర్థిక సాయం చేశారు. పదో తరగతి చదివి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇటీవల గురువులను ఆహ్వానించి సన్మానించారు.

ఆనందంగా ఉంది

– నాగూరు మీరాసాహెబ్, సీఐ, మేడికొండూరు



దాదాపు 23 సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయులను కలిశాం. వారితో గడిపాం. ఆనందంగా ఉంది. పాత మిత్రులంతా కలుసుకోవడం వెలకట్టలేనిది. పూర్వ విద్యార్థుల సమావేశం ఏటా నిర్వహించుకుంటాం.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు: షేక్ ఆలియా



గతంలో తాము చదువుకున్న రోజులకు.. ప్రస్తుత రోజులకు చాలా మార్పు ఉంది. సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువయ్యే కొద్దీ విద్యార్థులు దానికి బానిసలవుతున్నారు. వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం.

భవితకు మార్గాలు: షేక్ షాహిద్



నాడు గురువులు బోధించిన పాఠాలతోనే నేడు మేమంతా ఈ స్థాయిలో ఉన్నాం. ఏది మంచి, ఏదీ చెడు, ఎవరితో ఎలా మాట్లాడాలి? ఎలా వ్యవహరించాలి? పెద్దలతో గౌరవం వంటి విషయాలు పాఠాల రూపంలో చెప్పారు. వాటిని ఆచరిస్తున్నాం.

అందుబాటులో వరి విత్తనాలు, ఎరువులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రబీ సీజన్‌కు సంబంధించి రైతు సేవా కేంద్రాలలో వరి విత్తనాలు రాయితీపై అందించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి ప్రకటనలో తెలిపారు. బీపీటీ-5204.. 900 క్వింటాళ్లు, కేఎన్ఎం-1638.. 4500 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్-34449.. 800 క్వింటాళ్లు ఉన్నట్లు వివరించారు. యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

జగన్‌ను కలిసిన విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం తాడేపల్లిలోని నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరురూరల్ మండల వైకాపా అధ్యక్షుడు పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

వాల్మీకి ఆదర్శం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రామాయణం స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ అవసరమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ, పోలీసు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రామాయణం రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాస రావు, ఎస్‌బీ, ఏఆర్, డీటీసీ డీఎస్పీలు శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, గిరిధర్ రావు, ఏవో చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

నెల్లూరు(రవాణా): నగరంలోని రవాణా కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పించారు. డీటీసీ బి.చందర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలమురళీ కృష్ణ, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణ చంద్రరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతి నుంచి శిక్షణ కోర్సులు తగవు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఆరో తరగతి నుంచి నైపుణ్య శిక్షణ కోర్సులు పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఏఐడీఎస్‌వో నగర కార్యదర్శి వి.త్రినాథ్ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి వరకు విద్యార్థులకు చదువు తప్ప ఇతర శిక్షణలు తగవని అన్నారు.

విధుల్లో ప్రతిభ చూపాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్న దారా జయకుమార్, ఎస్.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులు, వి.శ్రీనివాసులుకు హెల్త్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ సూర్యతేజ గురువారం ఉత్తర్వులు అందజేశారు. నూతన విధుల నిర్వహణలో మెరుగైన ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.



హెల్త్ అసిస్టెంట్లతో కమిషనర్ సూర్యతేజ

రూ.20 లక్షలతో మౌలిక సదుపాయాలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెల్లూరు కోటమిట్టలోని షాదీమంజిల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తాను, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంయుక్తంగా రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం 43వ డివిజన్‌లోని షాదీమంజిల్‌లో ముస్లిం సోదరీమణులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2014-19 తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి మేయర్‌గా ఉన్న అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో షాదీమంజిల్‌ను చక్కగా నిర్మించారని తెలిపారు. రూ.20లక్షలు ఆయనకు ఇస్తామని, వాటితో అవసరమైన సామగ్రిని కొనుగోలు చేస్తారన్నారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు నాలుగు స్వీపింగ్ యంత్రాలు



నెల్లూరు నగరంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేసేందుకు నాలుగు భారీ స్వీపింగ్ యంత్రాలు నెల్లూరుకు చేరుకున్నాయి. అయిదేళ్ల క్రితం గత తెదేపా ప్రభుత్వ హయాంలో నాలుగు యంత్రాలను వినియోగించగా.. వైకాపా ప్రభుత్వం వాటిని మూలకు చేర్చేసింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారుల అంచుల్లో భారీగా మట్టి పేరుకుపోయింది. వాహనదారుల కళ్లలో పడి అవస్థలు పడేవారు. మంత్రి నారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని నాలుగు యంత్రాలను తెప్పించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

వ్యర్థాల తొలగింపులో జాప్యమా!

నగరంలోని పెద్దబజారు డైకస్‌రోడ్డు సెంటరులో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఉన్న రెండు చెత్తడబ్బాలు నిండిపోయి కుళ్లి దుర్గంధం వస్తోంది. నాలుగు రోడ్ల కూడలిలో వ్యర్థాలు దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మధ్యాహ్నం వరకు కూడా వ్యర్థాలను తొలగించకపోవడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. వ్యర్థాలు తొలగిస్తామని నగర పాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



తాగునీరు వృథా..



నగరంలోని రామలింగాపురం వంతెన మీదుగా ఆత్మకూరు బస్టాండ్‌కు వెళ్లేమార్గంలో ఇరిగేషన్ కాలువపై ఉన్న మెయిన్ పైపులైన్ పగిలిపోయింది. అక్కడ ఉన్న వాల్వు వద్ద నీరు వృథాగా పోతోంది. దీనివల్ల నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సమస్య నెలకునే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వృథాని అరికట్టాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట, రైల్వే)

అధికారులు పట్టించుకోక.. జనమే చొరవ

నగరంలోని ఇరుగాళమ్మ సంఘం వద్ద నెల్లూరు- పొట్టేపాళెం రోడ్డు మధ్యలో గుంత పడి వర్షపునీరు చేరింది. గుంత లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానికులు గుంతకు అడ్డుగా చెట్టు మొద్దు ఉంచారు. నరసింహకొండ, జొన్నవాడ దేవస్థానాలకు వెళ్లే భక్తులు, వివిధ గ్రామాలకు వెళ్లే బస్సులు రాకపోకలతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



మలుపులో జరభద్రం!



నెల్లూరు గ్రామీణ పరిధిలోని మాగుంట విగ్రహం సమీపాన స్థానిక ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లే మార్గంలో కూలిన దిమ్మె, అందులో కమ్ములు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపు తిరిగే సమయంలో దిమ్మె తగిలి ఇప్పటికే ఇద్దరు వాహనదారులకు ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందిస్తూ దిమ్మెను అక్కడి నుంచి తొలగిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా దేసి నాయక్ సుగాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఇరిగేషన్ సర్కిల్ నెల్లూరు డ్రైనేజీ డివిజన్ ఎస్ఈ దేసి నాయక్ సుగాలి నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో ఎస్ఈగా నియమితులయ్యారు. ఎస్ఎస్ఎల్‌సీ, ఎస్‌బీ సబ్ డివిజన్ నెంబర్ 3, కేఆర్ డ్యాం ఎస్ఎస్ఎల్‌సీ, ఎస్‌బీ డివిజన్ నెంబర్ 2 నెల్లూరు డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న కోట సుబ్రహ్మణేశ్వరరావుకు ఎస్‌సీ డివిజన్ నెంబర్ 2, సోమశిల ప్రాజెక్ట్ సర్కిల్ ఈఈగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇరిగేషన్ సబ్‌డివిజన్ నెంబర్ 1, కావలి, ఎన్ఎన్ డివిజన్ డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ముజాయిద్‌ఖాన్ పటాన్‌కు ఎన్ఎన్ డివిజన్ కావలి ఇరిగేషన్ సర్కిల్ ఈఈగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించారు.

త్వరగా నష్ట అంచనాలు తయారుచేయండి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా నియోజకవర్గ పరిధిలో ఏర్పడిన నష్టానికి, పునరుద్ధరణ పనులకు అంచనా వేసి ప్రతిపాదనలను త్వరితగతిన తయారు చేయాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్ రూరల్ తెదేపా కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి పలు శాఖల అధికార యంత్రాంగంతో ఎమ్మెల్యే గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ, ఎలక్ట్రికల్ ఈఈ, ర.భ, పంచాయతీరాజ్ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు రూరల్ మండలం కలివెలపాలెంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులకు తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

తెరపై ఈనాడు

ఎం–1 సినిమాస్– స్క్రీన్1..విశ్వం, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. వెట్టయ్యన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. వెట్టయ్యన్, స్క్రీన్2..జనక ఐతే గనక, స్క్రీన్3..ది వైల్డ్ రోబోట్, స్క్రీన్4..విశ్వం, స్క్రీన్5..దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1..దేవర, దివైల్డ్ రోబోట్, విశ్వం, స్క్రీన్2..విశ్వం, దేవర, స్క్రీన్3..వెట్టియ్యన్, స్క్రీన్4..విశ్వం, లవ్‌రెడ్డి, సిరిమల్టీప్లెక్స్..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. వెటయ్యన్, విశ్వం స్క్రీన్3.. విశ్వం, వెట్టయ్యన్ స్క్రీన్4.. జనక అయితే గనక

పాలకుల పాపం.. ఏటా సమస్య పునరావృతం



నీటి ఉద్ధృతికి కోసుకుపోయిన రోడ్డు

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే

ములుమూడి- సౌత్‌మోపూరు మధ్య రామన్న చెరువు వద్ద వర్షాకాలంలో ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం ములుమూడి నుంచి సౌత్‌మోపూరు వైపు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న రామన్న చెరువు నుంచి భారీగా వచ్చిన వరదనీటితో రోడ్డు కోసుకుపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం రాత్రి ఒక్కసారిగా పెద్దఎత్తున నీరు రోడ్డుపై ప్రవహించింది. వాహనదారులు తమ గమ్యస్థానాలు చేరేందుకు కొత్తూరు, ఆమంచర్ల మీదుగా దూరం తిరుగుకుని రాకపోకలు సాగించారు. ఆర్టీసీ బస్సులు కూడ ఇలానే వెళ్లాయి. నీటి ఉద్ధృతి తగ్గడంతో గురువారం ఉదయం నుంచి వాహనదారులు గుంతల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి.

తూములు పట్టించుకోక..

చెరువు నుంచి కలుజు ద్వారా నీరు వెళ్లేందుకు రోడ్డు కింద రెండు చోట్ల తూములున్నాయి. వీటిని పట్టించుకునే వారు లేరు. ఇవి దాదాపుగా పూడిపోయాయి. ఉన్న పైపులు చిన్నవిగా ఉన్నాయి. తూముల సైజును పెంచి భారీగా వరద వచ్చిన వెళ్లేందుకు వీలుగా పటిష్ఠం చేయాలని చాలా రోజులుగా ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సరిగా పనిచేయని తూములు

ముందస్తు వైద్య పరీక్షలతో ఉపయోగం

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: ఆధునిక జీవనశైలి, జంక్‌ఫుడ్, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం తదితర కారణాల వలన చిన్న వయసులోనే వ్యాధుల బారిన పడుతున్నారని నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్ రెడ్డి అన్నారు. 40సంవత్సరాలు పైబడిన వారందరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. వైద్యశాలలో నారాయణ హోల్ బాడీ హెల్త్ చెకప్‌నకు సంబంధించి బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ భార్య జన్మదిన వేడుకలు నిర్వహించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి

యాచకుడిపై దాడి

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: యాచకుడిపై వ్యాపారి దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక అర్చన థియేటరు ఎదురుగా ఫాస్ట్‌ఫుడ్స్ దుకాణం ఉంది. అదే ప్రాంతంలో చెత్తాచెదారం, వ్యర్థాలు ఏరుకునే నాగరాజు భోజనం కావాలని రూ.50 ఇచ్చాడు. తగిన నగదు తీసుకురావాలంటూ దుకాణం యజమాని పైప్ తీసుకుని తలపై కొట్టడంతో రక్తస్రావమైంది. ఇది గుర్తించిన అటుగా వెళ్లే ప్రజలు దుకాణ యజమానిపై గొడవకు దిగారు. అనంతరం 108 వాహనం పిలిపించి బాధితుడిని ఆసుపత్రికి తరలించారు.

మంత్రి సతీమణి జన్మదిన వేడుకలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: మంత్రి నారాయణ సతీమణి రమాదేవి పుట్టిన రోజు వేడుకలను కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు గురువారం ఘనంగా నిర్వహించారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో నారాయణ చేతుల మీదుగా కేకు కోసి పంచిపెట్టారు.

నెల్లూరు(జడ్పీ): నగరంలోని ప్రగతి ఛారిటీస్‌లో ఉన్న మానసిక దివ్యాంగుల వసతి గృహానికి నిత్యావసరాలు ఉచితంగా అందించారు. భారతసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.కె. ఖాసిం, కార్యదర్శి కె.కృష్ణయ్య, పాల్గొన్నారు.

ఆసుపత్రికి రూ. 1.20 లక్షల విరాళం

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి విశ్రాంత ఉపాధ్యాయుడు పి.ఆంజనేయ ప్రభు గురువారం రూ.1.20 లక్షలు సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధా నాయక్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రూ.లక్ష ఆసుపత్రి అభివృద్ధి కోసం, రూ.20వేలు చంటి బిడ్డల పాల డబ్బాల కోసం వినియోగించుకోవాలని కోరారు. నగదు జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సంఘంలో జమ చేస్తామని సిద్ధానాయక్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర, జీజీహెచ్ హెచ్‌వోడీ కళారాణి పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు ఆంజనేయ ప్రభు

జాబితాలో తప్పులు సరిచేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సచివాలయ ఏఎన్ఎం గ్రేడ్ 3 ఉద్యోగోన్నతుల జాబితాను విడుదల చేసింది. ఇందులో తప్పులు ఉన్నాయంటూ డీఎంహెచ్‌వో పెంచలయ్యను ఏపీ హంస జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సుకన్య గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాబితాలో అభ్యర్థుల జాయినింగ్ డేట్, ర్యాంకింగ్ తప్పుగా పొందుపరిచారని.. మార్పు చేయాలని కోరారు.

20, 21 తేదీల్లో సీపీఎం మహాసభలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ 15వ డివిజన్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం బాలాజీనగర్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీలలో వీజీబీ కల్యాణ మండపంలో సభలు జరుగుతాయన్నారు.

ఎంఎస్ఎంఈలకు అవగాహన సదస్సు రేపు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు, ఏపీ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఎంఎస్ఎంఈలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంకు ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఏకే నగర్‌లోని కెనరాబ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో జరిగే సమావేశంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలన్నారు.

పారిశుద్ధ్యానికి పాతర.. దోమల జాతర..

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

వర్షాలతో నగరంలోని ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త, నిల్వ ఉన్న మురుగు, వర్షం నీటితో కలిసి దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. వాటి నియంత్రణకు మూడు పద్ధతుల్లో చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమ నిరోధక మందులు చల్లాలి. రెండోసారి లార్వా పెరగకుండా మళ్లీ మందులు చల్లాలి. మూడోసారి వీధుల్లో ఫాగింగ్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ సమర్థంగా చేస్తే నియంత్రించవచ్చు. కానీ క్షేత్రస్థాయిలో ఇలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. దశల వారీగా దోమలను అరికట్టేలా ఆరు నెలల క్రితం ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. వాటిని వినియోగించిన సందర్భాలు లేవు. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



మాగుంట లేఅవుట్‌లోని స్థలంలో చేరిన నీరు

● చర్యలు చేపడతామని నగర పాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.